www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 5-5-2024

Tirupathi | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | తిరుపతి సిటీ

నీట్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

చిత్తూరు (సెంట్రల్), మే 4: జిల్లాలో ఆదివారం నిర్వహించే నీట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ కృష్ణబాబు తెలిపారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నేషనల్ ఎలిజిబులిటీ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) పరీక్షకు జిల్లావ్యాప్తంగా 814 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. చిత్తూరులోని సత్యనారాయణపురం బీవీరెడ్డి సీనియర్ సెకండరీ స్కూల్, మోర్ధానపల్లిలోని పీఈఎస్ పబ్లిక్ స్కూల్, సంతపేటలోని బృందావన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లను పరీక్షా కేంద్రాలుగా గుర్తించినట్లు వెల్లడించారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ద్వారా ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.20 గంటల వరకు ఆఫ్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించనున్నామని వివరించారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల్లోపు అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అడ్మిట్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఒక పోస్టుకార్డు సైజ్ ఫొటో, ఆధార్, పాస్‌పోర్టు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు ఏదేని ఒకటి తీసుకురావాలని పేర్కొన్నారు. వాటర్ బాటిల్, 50 ఎంఎల్ శానిటైజర్ బాటిల్‌కు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. సాధారణ దుస్తులు, చెప్పులు ధరించి రావాలన్నారు. మందపాటి చెప్పులు, బూట్లు, పెద్ద గుండీలున్న దుస్తులు, ఆభరణాలు, వాచీలకు అనుమతి లేదన్నారు.

వచ్చారు.. వెళ్లారు..

- జిల్లాకు, పలమనేరుకు ఒక్క హామీ ఇవ్వని జగన్
- పూతలపట్టు సభలోనూ ఇదే తరహా..
- నిరాశలో జిల్లా వాసులు

చిత్తూరు, మే 4 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా సీఎం ఓ ప్రాంతానికి వస్తున్నారంటే స్థానిక సమస్యల పరిష్కారానికి కొన్ని హామీలిస్తారని ప్రజలు ఆశిస్తారు..కానీ మన సీఎం జగన్ మాత్రం ఎక్కడికెళ్లినా చంద్రబాబే లక్ష్యంగా విమర్శలు, నిందలు. అంతకుమించి ఇంకేం ఆశించకూడదు.. ఆ మధ్య పూతలపట్టులో జరిగిన బస్సు యాత్ర సందర్భంగా కూడా జిల్లాకు, నియోజకవర్గానికి ఏ చిన్న హామీ ఇవ్వకుండానే వెళ్లిపోయారు. ఇప్పుడు ఎన్నికల ప్రచారానికి రెండోసారి జిల్లాకు వచ్చారు. ఈసారైనా జిల్లాకు, నియోజకవర్గానికి ఏదైనా హామీ ఇస్తారని ప్రజలు ఆశించారు. శనివారం పలమనేరులో జరిగిన బహిరంగసభ కూడా అలాగే సాగింది. ఎక్కడా జిల్లా, నియోజకవర్గ ప్రస్తావన తీసుకురాలేదు. ఆయన ప్రసంగం 25 నిమిషాల పాటు సాగింది. చంద్రబాబును విమర్శించేందుకు ఎక్కువ సమయాన్ని వాడేశారు. గత ఎన్నికల సమయంలో 2018 ప్రారంభంలో జగన్ ప్రతిపక్ష నేతగా జిల్లాలో పాదయాత్ర చేశారు. చిత్తూరులోని విజయా డెయిరీని, షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరిస్తానని హామీనిచ్చారు. అలాగే జిల్లాకు హంద్రీనీవా నీళ్లు తెస్తానని, జీడీనెల్లూరు నియోజకవర్గంలో అగ్నిమాపక కేంద్రం, డిగ్రీ కాలేజీ ఏర్పాటు వంటి అనేక హామీలు ఇచ్చారు. ఈ ఐదేళ్లలో వాటిలో ఒక్కటీ అమలు చేయలేకపోయారు. డెయిరీని మాత్రం అమూల్‌కు కట్టబెట్టేసి ఇదే పునరుద్ధరణ అన్నారు. గత హామీలను అమలు చేయలేకపోయిన జగన్ ఈసారి కొత్తవి ఎందుకులే అనుకున్నారేమోఅని ప్రజలు చర్చించుకుంటున్నారు.



సభలో మాట్లాడుతున్న జగన్

వచ్చామా.. వెళ్లామా.. అన్నట్లు సాగింది సీఎం పర్యటన. అలాగే గత ఎన్నికల ప్రచార సమయంలో పలమనేరులో పర్యటించిన సీఎం జగన్‌తోపాటు స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ కూడా నియోజకవర్గ అభివృద్ధికి హామీలిచ్చారు. ఆయన కూడా ఒక్క హామీని అమలు చేయలేకపోయారు.

ప్రయాణికులకు బస్సు కష్టాలు

పలమనేరు, మే4 : పలమనేరులో శనివారం ముఖ్యమంత్రి జగన్ బస్సుయాత్ర కోసం పోలీసులు ఉదయం నుంచి వాహనాలను మళ్లించారు. ఆర్టీసీ బస్టాండు సమీపంలోని క్లాక్‌టవర్ వద్ద ఎంబీటీ రోడ్డుపై సభ ఏర్పాటు చేయడంతో బస్టాండులోకి బస్సులు వెళ్లకుండా దారి మళ్లించారు. ఈ విషయం తెలియని ప్రయాణికులు బస్సులు ఎక్కడ ఉన్నాయో తెలియక ఇబ్బందిపడ్డారు. పైగా చిత్తూరు నుంచి పలమనేరుకు వచ్చే బస్సులు మార్కెట్ కమిటీ వద్ద ప్రయాణికులను దించి వెళ్లిపోయాయి. అక్కడి నుంచి మళ్లీ ఆటోల్లో వెళ్లాల్సి వచ్చిందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.



బస్సుల్లేక వెలవెలపోతున్న ఆర్టీసీ బస్టాండు

సీఎం సభకు మద్యం ఫుల్

పలమనేరు సీఎం సభలో మద్యం ఏరులై పారింది. వైసీపీ కార్యకర్తలకు ఏమాత్రమూ కొదవ లేకుండా మద్యం సరఫరా చేశారు. ఫుల్‌గా మందు కొట్టిన కార్యకర్తలు జగన్ మాట్లాడుతున్నంత సేపూ చిందులేస్తుండడం కనిపించింది. మద్యంతోపాటు బిర్యానీ పొట్లాలు పంపిణీ చేశారు.



పార్టీ జెండాపైనే మద్యం బాటిళ్లు ఉంచి తాగుతున్న వైసీపీ కార్యకర్తలు, మద్యం కేసులను కారు డిక్కీలో చేర్చుతున్న నాయకుడు

నేటినుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్/చిత్తూరు, మే 4 (ఆంధ్రజ్యోతి):ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవో, ఓపీవోలు, అత్యవసర సర్వీసుల్లో విధులు నిర్వహిస్తున్న వారంతా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును ఆదివారం నుంచి మూడు రోజుల పాటు వినియోగించుకోనున్నారు. ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న వారు ఓటు వేయనున్నారు.జిల్లాలోని అన్ని శాఖల్లో 31 వేలమంది ప్రభుత్వ ఉద్యోగులున్నారు. వారిలో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 16,571మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోనున్నారు.ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల లోపు ఉద్యోగులు తమ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవచ్చని జిల్లా అధికారులు తెలిపారు.

ఇతర జిల్లాల ఉద్యోగులకు కలెక్టరేట్‌లో ఓటింగ్

చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఇతర జిల్లాల ఉద్యోగుల కోసం కలెక్టరేట్‌లో ఆది, సోమవారాల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించామని కలెక్టర్ షన్మోహన్ చెప్పారు. శనివారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏడు నియోజకవర్గాల ద్వారా రిటర్నింగ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు.ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల కేంద్రాల్లో చిత్తూరు జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించామన్నారు.పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల ఓటరు జాబితాను ఆర్వోలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఓటర్ల సంఖ్యను బట్టి పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రతి ఫెలిసిటేషన్ సెంటర్‌లో అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాలకు వేర్వేరుగా కంపార్టుమెంట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.ఉద్యోగుల అవగాహన కోసం అన్ని సెంటర్ల వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని చెప్పారు.85 ఏళ్లు పైబడిన వృద్ధులకు, వికలాంగులకు ఈనెల 6, 7 తేదీల్లో వారి ఇళ్ల వద్దకే వెళ్లి హోమ్ ఓటింగ్ చేపడతామన్నారు. ఓటరు స్లిప్పుల పంపిణీ ఈనెల 6వ తేదీలోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు.

● బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ పూర్తి

కలెక్టరేట్‌లో చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించి బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం కలెక్టర్ షన్మోహన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సాధారణ ఎన్నికల పరిశీలకులు కైలాష్ వాంఖ్డే, షాదిక్ అలామ్ పర్యవేక్షించారు. చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 2318 బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియ ఈఎంఎస్2.0 సాఫ్ట్‌వేర్‌లో ఆన్‌లైన్ ద్వారా పూర్తిచేశామని చెప్పారు. ఈ సమావేశంలో డీఆర్వో పుల్లయ్య, రాజకీయపార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్టీ జెండా కట్టాడని టీడీపీ కార్యకర్తపై వైసీపీ దాడి

- గాయాలతో ఆస్పత్రిలో చేరిన వైనం



శేఖర్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, మే 4: సొంత ఇంటిపై పార్టీ జెండా కట్టుకుంటే సహించలేకపోతున్నాయి అధికార పార్టీ శ్రేణులు. దాడులు చేసి, భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కుప్పం మండలం మోట్లచేను గ్రామంలో శేఖర్ అనే టీడీపీ కార్యకర్త తన ఇంటిపై పార్టీ జెండా కట్టుకున్నారు. శనివారం కొందరు వైసీపీ నాయకులు ఆయన ఇంటికొచ్చారు. తమ పార్టీ ప్రచారంలో పాల్గొనాలని ఒత్తిడి చేశారు. ఇంటిపై టీడీపీ జెండాను తొలగించాలని ఆదేశించారు. వారి మాటలను వినకపోవడంతో గ్రామ శివార్లలోని తైలం చెట్ల తోటలోకి శేఖర్‌ను తీసుకెళ్లి దాడిచేసి గాయపరిచారు. ఇంటి మీద టీడీపీ జెండా ఎగిరితే ప్రాణం తీస్తామని బెదిరించారు. తీవ్ర గాయాలతో ఉన్న శేఖర్‌ను కుటుంబ సభ్యులు చికిత్స కోసం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడిని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ మండలాధ్యక్షుడు ప్రేమ్ కుమార్ తదితరులు పరామర్శించారు. వైసీపీ బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శేఖర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై శేఖర్ కుటుంబ సభ్యులు కుప్పం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొనసాగుతున్న ఎండలు

ఆరెంజ్ జోన్‌లోకి గుడుపల్లి, శ్రీరంగరాజపురం మండలాలు

చిత్తూరు కలెక్టరేట్, మే4: జిల్లాలో ఎండలు కొనసాగుతున్నాయి. రెండ్రోజులుగా సాయంత్రం వర్షం పడుతున్నా ఎండలు మాత్రం తగ్గడం లేదు. శనివారం గుడుపల్లి, శ్రీరంగరాజపురం మండలాలు ఆరెంజ్ జోన్‌లో చేరాయి. అలాగే శ్రీరంగరాజపురంలో 43.6, గుడిపాల 43.4, తవణంపల్లె, వెదురుకుప్పం 43, పులిచెర్ల 42.8, చిత్తూరు 42.4, గంగాధరనెల్లూరు, కార్వేటినగరం 42, పుంగనూరు 41.9, గుడుపల్లె, పూతలపట్టు 41.8, బంగారుపాళ్యం, సదుం 41.6, పెద్దపంజాణి, సోమల 41.5, పాలసముద్రం 41.3, పలమనేరు, పెనుమూరు, చౌడేపల్లి, నగరి, రొంపిచెర్ల, యాదమరి 41.1, గంగవరం 40.7, కుప్పం 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

వైసీపీ సర్పంచ్ కారులో కర్ణాటక మద్యం

రూ.3,50,700 విలువైన 58కేసుల స్వాధీనం



బైరెడ్డిపల్లె, మే 4 : కారులో నిల్వ ఉంచిన కర్ణాటక మద్యాన్ని బైరెడ్డిపల్లెలోని ఓ పెట్రోలు బంక్ వద్ద శనివారం ఉదయం జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. ఇది మండలంలోని ఆలప్పల్లె వైసీపీ సర్పంచ్ రమణారెడ్డికి సంబంధించిందిగా గుర్తించారు. రూ.3,50,700 విలువైన 58 కేసుల కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ఈ తనిఖీలు నిర్వహించారు.

కలుషిత మజ్జిగ తాగి 20 మందికి అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

పలమనేరు, మే4 : కలుషిత మజ్జిగ తాగి 20 మంది అస్వస్థతకు గురయ్యారు. గంగవరం మండలం నల్లసానిపల్లి గ్రామానికి చెందిన పలువురు శనివారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఈశ్వరయ్య ఇంటి వద్ద పెరుగు కొని మజ్జిగ చేసుకుని తాగారు. కొంతసేపటికే విరేచనాలు ప్రారంభమయ్యాయి. పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో చేరారు. ప్రాణాపాయం లేదని, కలుషిత మజ్జిగ తాగడం వల్లే విరేచనాలయ్యాయని వైద్యులు తెలిపారు.

రూ.1.38లక్షల సీజ్



గుడిపాల, మే 4: మండలంలోని చిత్తూరు-వేలూరు జాతీయ రహదారిలోని గొల్లమడుగు చెక్‌పోస్టు వద్ద శనివారం రూ.1.38 లక్షల నగదును సీజ్ చేసినట్లు తనిఖీ అధికారి గణపతి తెలిపారు. వేలూరు నుంచి రామసముద్రానికి టాటా ఏస్ వాహనంలో సునీల్ వెళుతున్నాడు. చెక్‌చేయగా ఎలాంటి ఆధారాలూ లేకుండా తీసుకొచ్చిన డబ్బును సీజ్ చేసినట్లు ఆయన వివరించారు.

చిత్తూరులో పోస్టల్ బ్యాలెట్‌కు ఆరు పోలింగ్ కేంద్రాలు

చిత్తూరు కలెక్టరేట్, మే 4: చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌లకు సంబంధించి ఆరు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు తెలిపారు. శనివారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 5, 6 తేదీల్లో ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన శనివారం సమావేశమయ్యారు. అంతకుముందు ఆయన డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించారు. ఏఆర్వోలు అరుణ, శ్రీనివాసుల రెడ్డి, విజయలక్ష్మి, డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, సెక్టోరల్, రూట్ ఆఫీసర్లు ఆయన వెంట ఉన్నారు.





కొత్త బస్టాండ్ వద్ద కూలిన సిగ్నల్ లైట్ - వర్షపు నీటిలో ఇబ్బంది పడుతున్న వ్యాపారి

చిత్తూరులో గాలివాన

● నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

చిత్తూరు, మే 4: చిత్తూరులో శనివారం సాయంత్రం గాలితో కూడిన వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రతతో జనం ఉక్కిరిబిక్కిరి అయ్యారు. తర్వాత చిరుజల్లులతో కూడిన వర్షం ప్రారంభమైంది. వర్షానికి గాలులు తోడవడంతో పోస్టాఫీసు, కొంగారెడ్డిపల్లె వద్ద చెట్లు కూలడంతో వాటి కింద పార్కింగ్ చేసి ఉన్న కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రంగాచారి వీధి, టీడీపీ కార్యాలయం, ఎన్టీఆర్ బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ వద్ద చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలాయి. ఉడిపి హోటల్ వద్ద పెద్దగోడ కూలింది. ఆ సమయంలో అక్కడ జనం లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. నగరపాలక సంస్థకు చెందిన పలు హోర్డింగ్స్, ఫ్లెక్సీలు చిరిగిపోయాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. కాలువల్లోని చెత్తాచెదారం రోడ్లపైకి చేరింది. పీవీకేఎన్ డిగ్రీ కళాశాల నుంచి లోతట్టు ప్రాంతాల్లోకి నీరు రావడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. వీధి వ్యాపారులకు కొంతమేర నష్టం వాటిల్లింది.

10 మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, మే 4: గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 10 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది. తవణంపల్లెలో 37.6, గంగవరం 14.6, పలమనేరు 8.4, గుడుపల్లి 8.2, పూతలపట్టు 5.4, కుప్పం 4.2, వెదురుకుప్పం 2.4, పెద్దపంజాణి 2.4, చిత్తూరు 1.0, శాంతిపురంలో 1.0 మి.మీ వర్షపాతం నమోదైంది.

పంటలు నేలమట్టం

గుడిపాల, మే 4: మండలంలో శనివారం వీచిన పెనుగాలులకు వివిధ పంటలు నేలమట్టమయ్యాయి. తుమ్మలవారిపల్లె దళితవాడకు చెందిన గాంధీ అరటి తోటలో చెట్లు, గెలలు నేలకూలాయి. చిత్తపార, పాపసముద్రం, బండపల్లె, పిల్లారికుప్పం తదితర ప్రాంతాల్లో మిరప, అరటి, వరి పంటలు దెబ్బతిన్నాయి.

వి.కోటలో 16 మేకల మృతి

వి.కోట, మే 4: వి.కోట మండలం నాయకనేరి అటవీ ప్రాంతంలో పిడుగుపాటుకు 16 మేకలు మృతి చెందాయి. బోయచిన్నాగనపల్లె పంచాయతీ రామనాథపురానికి చెందిన శంకరప్ప మేకల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నాడు. శనివారం మేకలను మేత కోసం దుర్గం అటవీ ప్రాంతానికి తోలుకెళ్లాడు. వర్షం పడడంతో తలదాచుకునేందుకు సమీపంలోని చౌడేశ్వరమ్మ ఆలయం వద్దకు మేకలను తోలుకెళ్లాడు. పిడుగుపడడంతో 16మేకలు అక్కడికక్కడే మృతిచెందాయి.

జీడీ నెల్లూరులో తెగిన విద్యుత్ వైర్లు



గారంపల్లెలో కూలిన విద్యుత్ స్తంభం

గంగాధరనెల్లూరు, మే 4: మండలంలో వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరగడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గారంపల్లె, పోలినాయుడుపల్లె, కొత్తవెంకటాపురం, కాశేపల్లె, బాలగంగనపల్లె, సిద్దేశ్వరకొండ, ఎట్టేరి తొమ్మిదో మైలు గ్రామాల్లో 10 విద్యుత్ స్తంభాలు, బాలగంగనపల్లె వద్ద చెట్టుకొమ్మలు విరిగిపడి విద్యుత్ వైర్లు తెగిపోయాయి. దీంతో సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ అధికారులు స్పందించి రాత్రి 8.30గంటలకు సరఫరాను పునరుద్ధరించారు.



బాలాజీకాలనీలో కూలిన విద్యుత్ స్తంభం

పిడుగు పడి నాలుగు ఆవుల మృతి

పెనుమూరు/పూతలపట్టు/వెదురుకుప్పం : మండలంలో వడగండ్ల వాన కురిసింది. పిడుగులు పడటంతో సీఆర్ కండ్రిగలో ఒకటి, బండమీదూరులో రెండు ఆవులు మృతి చెందాయి. అలాగు గొడుగుమానుపల్లి, సీఎస్ అగ్రహారం, కొటార్లపల్లి గ్రామాల్లో కొబ్బరిచెట్లు కాలిపోయాయి. గాలి, వడగండ్ల వానతో మామిడి కాయలు రాలిపోయాయి. పూతలపట్టు మండలం రమణయ్యకండిగ గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు ఇంటి పక్కన చింతచెట్టుపై పిడుగు పడడంతో ఇంట్లో ఉన్న టీవీ, ఫ్రిజ్, ఏసీ, ఫ్యాన్లు, కూలర్ దగ్ధమయ్యాయి. వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లె పంచాయతీ కొండకిందపల్లె గ్రామంలో పిడుగుపాటుకు ఎస్.శ్రీనివాసులురెడ్డికి చెందిన పాడి ఆవు మృతి చెందింది. కొన్ని ప్రాంతాల్లో వడగండ్ల వాన పడింది.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



శ్రీరంగరాజపురం, మే 4: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. మండలంలోని పొదలపల్లి గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు పవన్(25) పని నిమిత్తం శనివారం ద్విచక్ర వాహనంలో పళ్లిపట్టుకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా క్షీరసముద్రం బస్టాప్ వద్ద క్షీరసముద్రం గ్రామానికి జగదీశ్వర నాయుడు ద్విచక్ర వాహనంలో వచ్చి పవన్ బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో పవన్ అక్కడికక్కడే మృతిచెందాడు. జగదీశ్వర్ నాయుడు స్వల్పంగా గాయపడ్డాడు. మృతుడికి ఆరు నెలల క్రితం పెళ్లయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కుళాయిప్ప తెలిపారు.



పలమనేరు పాతపేటలోని కాళికమ్మ ఆలయంలో శనివారం ఉదయం ఒక వానరం లోనికి ప్రవేశించింది. అమ్మవారి ముందుంచిన పళ్లెంలోని అరటి పండు తీసుకుని అర్చకులు, భక్తుల పక్కనే కూర్చొని తిని వెళ్లిపోయింది. ఆంజనేయుడే వచ్చి ప్రసాదం తీసుకుని వెళ్లారని అర్చకులు, భక్తులు భావించారు.

వాళ్లు ఇక్కడ.. వీళ్లు అక్కడ?

● పుత్తూరు, వడమాలపేట ఉద్యోగులకు తిరుపతిలో బ్యాలెట్ పోలింగ్ కేంద్రం

● నగరి, నింద్ర, విజయపురం వారికి పుత్తూరు కేటాయింపు

పుత్తూరు అర్బన్, మే 4: నగరి నియోజకవర్గ పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల నిర్ణయం గందరగోళానికి దారి తీస్తోంది. పుత్తూరు, వడమాలపేటకు చెందిన పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్‌లో పోలింగ్ కేంద్రం కేటాయించడం పట్ల ఉద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి. అలాగే నగరి, నింద్ర, విజయపురానికి చెందిన ఓటర్లకు పుత్తూరులోని బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. నగరి నియోజకవర్గాన్ని రెండుగా విభజించి పోలింగ్ కేంద్రాలను కేటాయించడం పట్ల వారు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఉన్నపళంగా శనివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలను మార్చడం పట్ల వారు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

నగరి నియోజకవర్గ పరిధిలోని పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలో ఉన్నాయి. ఎన్నికల నిర్వహణకు మాత్రం చిత్తూరు కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా, నగరి ఆర్డీవో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారిగా ఉన్నారు. ఎన్నికల నిర్వహణ వ్యవహారాలు ఇక్కడి ఆర్డీవో పరిధిలోకే వస్తాయి. సాధారణంగా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు ఆయా నియోజకవర్గ కేంద్రంలో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నగరి నియోజకవర్గానికి పుత్తూరును ఎంపిక చేశారు. నగరిలో సరైన వసతులున్న పాఠశాలలేవీ లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో నియోజకవర్గంలోని ఉద్యోగులు పుత్తూరులోనే బ్యాలెట్ ఓటింగ్ వేయాల్సి ఉంటుంది. శనివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాలను తిరుపతి కలెక్టరు విడుదల చేసిన కేంద్రాల ప్రకటనలో పుత్తూరు, వడమాలపేట మండలాల్లోని ఉద్యోగులు తిరుపతిలోని ఎస్వీయూ క్యాంపస్‌లో ఓటు వేయాలని పేర్కొన్నారు. దీంతో పుత్తూరు, వడమాల పేట నుంచి తిరుపతికి వచ్చి ఓట్లు వేయాల్సి ఉంటుంది. అలాగే, చిత్తూరు జిల్లా పరిధిలోకి వచ్చే నగరి, నింద్ర, విజయపురం మండలాల ఉద్యోగులు మాత్రం తిరుపతి జిల్లాలోని పుత్తూరు బాలికల ఉన్నత పాఠశాలలో ఓటు వేయాలి. ఇలా పుత్తూరు, వడమాలపేట వాళ్లు తిరుపతికి... విజయపురం, నింద్ర, నగరి మండలాల వాళ్లు పుత్తూరుకు వచ్చి ఓటు వేయాల్సి రావడంపై ఉద్యోగ సంఘాలు విస్మయం వ్యక్తంచేస్తున్నాయి. ఈ ఎండల్లో ఇలా తిప్పించడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

ఉద్యోగులను వేధిస్తున్న ప్రభుత్వం

పోలింగ్ సమీపిస్తున్నా ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం, కొందరు అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఆరోపించారు. శనివారం సాయంత్రం పోలింగ్ కేంద్రాన్ని తిరుపతిలో ఏర్పాటు చేస్తున్నట్లు తిరుపతి కలెక్టర్ ప్రకటించడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హడావిడి నిర్ణయం ఎందుకు తీసుకున్నారని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ఓటు ఉంటే పక్క నియోజకవర్గంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడం ఏమిటని నిలదీశారు. ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లోను తమ ఓటు హక్కును వినియోగించుకుని ప్రభుత్వానికి, వంత పాడుతున్న అధికారులకు గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు.

పెద్దిరెడ్డి అరాచకాలు, పక్షపాత పోలీసులపై

రాష్ట్రపతి, సీఈసీలకు ఫిర్యాదు

బీసీవైపీ అధ్యక్షుడు రామచంద్రయాదవ్

పుంగనూరు, మే 4: నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి అరాచకాలు, సదుంలో దాడులు, పోలీసుల పక్షపాత వైఖరిపై రాష్ట్రపతి, కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్లు బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ తెలిపారు. ఆ వివరాలను శనివారం ఆయన మీడియాకు విడుదల చేశారు. తనపై, తన అనుచరులపై జరిగిన దాడిలో ప్రమేయం ఉన్న పెద్దిరెడ్డి కుటుంబంపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. దాడులపై ఫొటోలు, ఆధారాలు, పోలీసుల వైఫల్యాలు, తప్పుడు కేసులపై ఫిర్యాదు చేసినట్లు వివరించారు. అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి, పుంగనూరు సీఐ రాఘవరెడ్డి, సదుం ఎస్‌ఐ మారుతి మరికొందరు మంత్రి ఆదేశాల మేరకు ఏకపక్షంగా పనిచేస్తున్నారని తెలిపినట్లు పేర్కొన్నారు. తనపై తొందరపాటు చర్యలు తీసుకోరాదని హైకోర్టు ఆదేశించినా ఏవో కేసులు, నోటీసులంటూ ఇంటిచుట్టూ పోలీసులు చుట్టుముట్టి అరెస్టు చేయడానికి వస్తున్నారనే విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.

వాహనాల ధ్వంసంపై ఫిర్యాదు

గత నెల 29వ తేదీ సదుం మండలంలో ప్రచారం చేస్తున్న తమపై మంత్రి పెద్దిరెడ్డి కుటుంబీకులు, అనుచరులు దాడులు, నిప్పు పెట్టిన ఘటనలో 17 వాహనాలు ధ్వంసం కాగా, పలువురు గాయపడినట్లు బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదుం ఎస్‌ఐ మారుతి, వైసీపీ నేతల ప్రమేయంతోనే తనపై హత్యాయత్నం జరిగిందని, పోలీస్‌స్టేషన్‌లో కూడా రక్షణలేదని పేర్కొన్నారు.

వి.కోటలో భారీ చోరీ

బంగారం, వెండి నగలు పట్టుకెళ్లిన దుండగులు



బీరువా పగులగొట్టిన దృశ్యం

వి.కోట, మే 4: పట్టణంలోని సిద్ధార్థనగర్‌లో శనివారం చోరీ జరిగింది. యర్రంపల్లెకు చెందిన నవనీతమ్మ కుటుంబం సిద్ధార్థనగర్‌లో కొత్త ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. బెంగళూరులో ఉంటున్న భర్త భాస్కర్ వద్దకు గురువారం పిల్లలతో కలసి వెళ్లారు. దొంగలు తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా బద్దలు కొట్టి అందులోని బంగారు, వెండి ఆభరణాలతోపాటు రూ.30 వేల నగదు చోరీ చేశారు. శనివారం మధ్యాహ్నం ఇంటికి వచ్చిన నవనీతమ్మ తాళం విరిగిపడి ఉండటంతో లోనికెళ్లి చూసింది. చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. 100 గ్రాముల బంగారం, 200 గ్రాముల వెండి ఆభరణాలతోపాటు రూ.30 వేల నగదు చోరీ జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం ద్వారా ఆధారాలు సేకరించారు. సీఐ లింగప్ప కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీతోనే దళితుల అభ్యున్నతి

చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు



దళితభేరిలో మాట్లాడుతున్న దగ్గుమళ్ల ప్రసాద్‌రావు

తవణంపల్లె, మే 4: టీడీపీతోనే దళితుల అభ్యున్నతి సాధ్యమని చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు, పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. శనివారం కాణిపాకం క్రాస్ వద్ద గల సీడీఎం కల్యాణ మండపం ప్రాంగణంలో పూతలపట్టు నియోజకవర్గ స్థాయి దళితభేరి కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ను నిర్వీర్యం చేసి, నిధులను దారి మళ్లించి దళితులకు అన్ని విధాలా నష్టం చేసిందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక చేయూత అందించకుండా దళితులకు తీరని ద్రోహం చేసిన ఘనత వైసీపీదే అన్నారు. దళితులు ఆర్థికంగా ఎదగాలన్నా, రాష్ట్రంలో సమర్థవంత పాలన కావాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమన్నారు. దళితులకు రావాల్సింది సాధించుకోవాలంటే ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా మురళీమోహన్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు థామస్, పార్టీ మండలాధ్యక్షుడు గాలి దిలీప్, గిరిధర్ బాబు, రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరిప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్,నాయకులు మోహన్‌నాయుడు,సునీల్, కోదండయ్య పాల్గొన్నారు.

జిల్లా సర్వతోముఖాభివృద్ధే మా అజెండా

చిత్తూరు సిటీ : జిల్లాను సర్వతోముఖాభివృద్ధి చేయడమే తమ అజెండా అని టీడీపీ చిత్తూరు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, విజనరీ చంద్రబాబు స్ఫూర్తితో ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానన్నారు. పార్టీ అధికారంలోకి రాగానే చిత్తూరును పారిశ్రామిక హబ్‌గా మారుస్తామని తెలిపారు. ఔత్సాహికులైన యువత ముందుకు వస్తే పరిశ్రమల స్థాపనకు అవకాశం కల్పిస్తామన్నారు. మౌళిక వసతుల కల్పన, విద్య, వైద్య రంగాల్లో మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. టీడీపీ ఎస్సీ సెల్ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు పీటర్ పాల్గొన్నారు.





మాట్లాడుతున్న మురళీమోహన్ - హాజరైన దళితులు

వీళ్లకి ఓటేస్తే ఏమి వస్తుంది?




ఇంటిపై కప్పిన ప్లాస్టిక్ టార్పాలిన్ - అస్లాం ఇంటి లోపలి పరిస్థితి

అదే మా ఇల్లు. దగ్గర దగ్గర పదైదు అప్లికేషన్లు నేను ఇచ్చిండాను. ఇంటి కోసం తిరిగాను. ఏదేదో చేస్తే కూడా వైసీపీ గవర్నమెంటు నుంచి నాకు ఒగింత కూడా ఏమీ రాలేదు. మేము ఓటు వేసింది వైసీపీకే. ఇప్పుడు కూడా వైసీపీ వాళ్లు ఓటడిగేకి వస్తుండారు. వీళ్లకి ఓటేస్తే ఏం ప్రయోజనం. ఓటేస్తే మాకేమి వస్తుంది?

ఈ ప్రశ్న వేసింది వైసీపీ నాయకుడే. వైసీపీ రామకుప్పం మండలం ముస్లిం మైనారిటీ యువజన విభాగం అధ్యక్షుడు అస్లాం. రామకుప్పంలోని తన ఇంటి దుస్థితిని చూపిస్తూ ఆవేదనతో ఆయన చేసిన వీడియో వైరల్ అవుతోంది. - రామకుప్పం



● హామీల అమల్లో ఎమ్మెల్యే ఫెయిల్

డెయిలీ మెన్యూ

నన్ను గెలిపిస్తే ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలి అన్న విధంగా పేరు తెచ్చుకుంటా.

- అలాగని 2019 ఎన్నికల ప్రచారం సందర్భంగా పలమనేరు ప్రజలకు పది హామీలిచ్చి మరీ వెంకటేగౌడ చెప్పారు. అదీ అప్పటి ప్రతిపక్ష నేత జగన్ ముందే మాట్లాడారు. ఈ ఐదేళ్లలో ఒక్కటీ నెరవేర్చలేదు. ఆ విషయంలో ఎమ్మెల్యేగా ఆయన ఫెయిలయ్యారు.

ఆయనేం చేస్తానన్నారంటే: పలమనేరును మాస్టర్ ప్లాన్ ద్వారా అభివృద్ధి చేస్తా. పట్టణాన్ని ఆనుకుని ఉన్న పెద్దచెరువులో మురుగునీరు చేరకుండా మళ్లిస్తా. ఇంటింటికీ కొళాయి కనెక్షన్ ఇప్పిస్తా. టమోటా రైతులకోసం కోల్డుస్టోరేజి నిర్మిస్తా. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుచేసి యువతకు ఉపాధి కల్పిస్తా. మూడు దశాబ్దాలుగా ఉన్న ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తా.



పంటపొలాల్లో ఏనుగులు (ఫైల్‌ఫోటో)



ఏనుగుల దాడిలో నామరూపాలు లేకుండాపోయిన మామిడిచెట్లు(ఫైల్‌ఫోటో)

పట్టుగూళ్ల ఉత్పత్తి చేస్తున్న పట్టురైతులకు కిలోకు రూ.50 ప్రోత్సాహకంగా ఇప్పిస్తా.. పట్టురీలింగ్ కేంద్రాన్ని పునఃప్రారంభిస్తా. బైరెడ్డిపల్లె వద్ద కైగల్ నది వద్ద రిజర్వాయర్ నిర్మిస్తా. హంద్రీనీవా నీటిని పలమనేరుకు తీసుకొచ్చి తాగు, సాగునీటి సమస్య లేకుండా చేస్తా. పలమనేరు సమీపంలోని కాలువపల్లి వద్ద వైఎస్సార్‌జలాశయానికి అనుబంధంగా గంగన్న శిరస్సుప్రాజెక్టు నిర్మిస్తా. తద్వారా పలమనేరు ప్రజలకు తాగునీటి సమస్యే లేకుండా చేస్తా. - పలమనేరు

జన కేతనం

www.andhrajyothy.com

ఆదివారం 5 మే 2024

జిల్లా కేంద్రం.. అమాత్యులేరీ?

● మీకు తెలుసా?

జిల్లా కేంద్రమైన చిత్తూరు నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో ఒక్కరు కూడా మంత్రి కాలేదు. ఈ నియోజకవర్గంలో విజయం సాధించిన వారంతా రెండు సార్లకు మించి ఎమ్మెల్యేగా గెలవలేదు. వీరిలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు మాత్రమే ఒకసారి ఇండిపెండెంట్‌గా, మూడుసార్లు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. మిగిలిన వారంతా తక్కువసార్లే విజయం సాధించినా.. వారిలో ఎవరికీ మంత్రిపదవి లభించలేదు. - చిత్తూరు

1999లో ఓటింగ్ యంత్రాలు

● నోట్ దిస్ పాయింట్



ఓటింగ్ యంత్రాలను తొలుత 1999 ఎన్నికల్లో గోవాలో వినియోగించారు. ఓటింగ్ యంత్రాల్లో వీవీ ప్యాట్లను ఏర్పాటు చేయాలని 2013లో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ మేరకు వీటిని ఏర్పాటు చేశారు. - చిత్తూరు కలెక్టరేట్

సీపీఎస్సా.. అదెంత సేపన్నా. అధికారంలోకి వస్తే వారంలో రద్దు చేసేస్తా.

- విపక్ష నేతగా పాదయాత్ర చేస్తున్న జగన్‌ను ఉద్యోగులు కలిసినప్పుడు ఇచ్చిన హామీ ఇది. ఇలా ప్రతిచోటా దాదాపు 150 సార్లు చెప్పి ఉంటారు.

సీపీఎస్ రద్దు చేయలేం. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుంది. అప్పుడు సరైన అవగాహన లేకుండా చెప్పాం. దానికన్నా మెరుగైన జీపీఎస్ తెస్తాం.

- సీపీఎస్ రద్దు హామీతో గంపగుత్తగా ఉద్యోగుల ఓట్లు వేసుకుని అధికారంలోకి వచ్చాక సీఎం సహా వైసీపీ నేతలు మాట మడతేశారిలా. ఉద్యోగుల్ని మోసం చేశారు.



మాట తప్పేన్ మడమ తిప్పేన్!



● చెప్పడంటే.. చేయడంతే!

● వారంలో సీపీఎస్ రద్దు హామీ.. అవగాహన లేక ఇచ్చారట

● జీపీఎస్ పేరుతో కంటితుడుపు చర్య ● జిల్లాలో 10,435 బాధిత ఉద్యోగులు

టీచర్లందరూ పిల్లలకు వారానికి ఏడు రోజులనే బోధించారు. కానీ, టీచర్లకు మాత్రం సీఎం జగన్ వారానికి ఎన్ని రోజులో చెప్పడం లేదు. సీపీఎస్ రద్దు హామీ నెరవేర్చకుండా, వారమంటే నాలుగేళ్లో అయిదేళ్లో తేల్చకుండా టీచర్లకు, సీపీఎస్ ఉద్యోగులకు కొత్త పాఠాలు నేర్పిస్తున్నారు. హామీలు అమలు చేయకుంటే కాలర్ పట్టుకుని నిలదీయమని ప్రతిపక్ష నేతగా చెప్పిన జగన్.. సీఎం అయ్యాక అవగాహన లేకుండా సీపీఎస్ రద్దు హామీ ఇచ్చామని యూటర్న్ తీసుకున్నారు. ఓపీఎస్ అమలు చేయకపోవడంతో జిల్లాలో 10,435 మంది సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నష్టపోయారు. వైసీపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ.. సీపీఎస్ రద్దు కోసం వీరంతా పెద్దఎత్తున ఆందోళనలు చేశారు. అనేక రూపాల్లో నిరసనలు చేసి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఇచ్చిన హామీని పక్కనపెట్టిన జగన్ సర్కారు.. ఉద్యోగులకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాని జీపీఎస్ అంటూ కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. ఉద్యోగుల ఆందోళనల్ని తొక్కేయాలని శతవిధాలా ప్రయత్నించినా.. అరెస్టులు చేసినా.. ఉద్యోగులు ఇప్పటికీ ముక్తకంఠంతో నినదిస్తూనే ఉన్నారు.



తగిన మూల్యం చెల్లించక తప్పదు

వారం రోజుల్లో సీపీఎస్ రద్దు చేస్తానన్న సీఎం ఐదేళ్లు పూర్తయినా అమలు చేయకపోవడం అన్యాయం. ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్నా ఇక్కడ హామీ నిలబెట్టుకోకపోవడం దారుణం. సీపీఎస్ రద్దు చేస్తామంటే నమ్మి గత ఎన్నికల్లో ఆయన వెంట నడిచాం. ఇప్పుడు ఆయన తగిన మూల్యం చెల్లించక తప్పదు.

- హేమచంద్రారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి, కార్వేటినగరం

అక్కడ రద్దు చేశారుగా?

ఓపీఎస్ పునరుద్ధరణ వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై భారం పడుతుందని.. ఆర్థిక పరిస్థితి మరింతగా దిగజారిపోతుందని వైసీపీ ప్రభుత్వం కొత్త వాదన లేవనెత్తింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చలేమని, సీపీఎస్ రద్దు చేయడం కుదరదని చేతులెత్తేసింది. మరి అదే సమయంలో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రాష్ట్రాలు ఎలా రద్దు చేశాయి? కర్ణాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లుగా ప్రస్తుత ప్రభుత్వాలు సీపీఎస్ రద్దును ఎలా ప్రకటిస్తున్నాయి? అని ఇక్కడి ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్)

ఉద్యోగి పదవీ విరమణ చేశాక.. చివరి నెలలో ఉన్న వేతనంలో 50 శాతాన్ని సర్వీసు పెన్షన్ కింద ప్రభుత్వం చెల్లించేది. ఒకవేల పెన్షన్‌దారుడు మరణిస్తే అతడి భార్య ఆ తర్వాత వారిపై ఆధారపడిన దివ్యాంగులైన, పెళ్లికాని పిల్లలకు పెన్షన్ ఇచ్చేవారు.

సీపీఎస్ (కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్)

ఉద్యోగి చందా ఆధారిత స్కీమ్ కింద వారి బేసిక్ పే, డీఏ నుంచి ప్రతి నెలా 10 శాతం చొప్పున కట్ చేస్తారు. దానికి ప్రభుత్వం మరో 10 శాతం జత చేసి ఎన్‌పీఎస్-ఎన్ఎస్‌డీఎల్‌కు బదిలీ చేస్తుంది. సదరు ఉద్యోగి పదవీ విరమన నాటికి రూ.10 లక్షలు ఖాతాలో ఉంటే.. ఆ మొత్తం నుంచి 60 శాతం (రూ.6 లక్షలు) రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కింద చెల్లిస్తారు. మరో 40 శాతం సొమ్మును షేర్ మార్కెట్‌లో కొనసాగిస్తూ.. వచ్చే లాభనష్టాలతో కలిపి ఎంతో కొంత ప్రతి నెలా పెన్షన్ రూపంలో చెల్లిస్తారు. ఇది సామాజిక పెన్షన్ కంటే తక్కువగా వస్తుంది.

జీపీఎస్ (గ్యారెంటీ పెన్షన్ స్కీమ్)

సీపీఎస్‌కు ప్రత్యామ్నాయంగా జీపీఎస్ విధానాన్ని తీసుకొస్తున్నామని వైసీపీ ప్రభుత్వం చెప్పింది. ఈ విధానంలో ఉద్యోగి రిటైర్‌మెంట్ అయ్యాక పెన్షన్‌కు పూర్తి గ్యారెంటీ అని అంకెల గారడీ చేసింది. ఈ లెక్కలన్నీ తప్పుల తడకలే అని ఉద్యోగులు అంటున్నారు. ఇందులో రిటైర్‌మెంట్ అయ్యాక ఎలాంటి బెనిఫిట్స్ ఉండవు. - చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పెనంలో నుంచి పొయ్యిలో పడ్డట్లు



ఓపీఎస్‌ను రద్దు చేయకపోగా, జీపీఎస్ విధానాన్ని తెచ్చారు. దాన్ని మేము వ్యతిరేకించాం. పెనంలో నుంచి పొయ్యిలో పడ్డట్లు.. ప్రభుత్వ కాంట్రిబ్యూషన్‌తో పాటు మాది కూడా ఆపేసి ఆరు నెలలైంది. దీంతో మరింత నష్టం తప్పడం లేదు. నవంబరు నుంచి నా కాంట్రిబ్యూషన్ కట్ అవుతున్నా.. ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ జమ చేయడం లేదు. డీఏ అరియర్స్ కూడా రాలేదు.

- సమీర్, ఏపీ సీపీఎస్ ఈఏ సంఘం జిల్లా అధ్యక్షుడు

జీపీఎస్‌ను బలవంతంగా రుద్దుతున్నారు



సీపీఎస్ విధానంతో లక్షలాది మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు అభద్రతాభావంతో కొట్టుమిట్టాడుతున్నారు. అకాల మరణం పొందిన సీపీఎస్ ఉద్యోగుల కుటుంబాలు మానసిక, ఆర్థిక సమస్యలు వర్ణనాతీతం. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీని అమలు చేయకపోగా గ్యారెంటీ లేని పెన్షన్ స్కీమ్‌ను బలవంతంగా రుద్దడం అన్యాయం.

- గణేష్, సీపీఎస్ ఉపాధ్యాయుడు, పూతలపట్టు

ఉద్యోగులకు అండగా నిలవాలి



ప్రభుత్వ ఉద్యోగి, ఉపాధ్యాయుడు తన జీవితంలో యవ్వనం మొత్తం ప్రజల శ్రేయస్సు కోసం శ్రమిస్తాడు. అలాంటి ఉద్యోగికి వద్ధాప్యంలో ప్రభుత్వం నుంచి ఆసరా అత్యవసరం. ఏ ప్రభుత్వ పథకం అందని ప్రభుత్వ ఉద్యోగికి శేష జీవితంలో నూతన పెన్షన్ విధానం ఏ మాత్రం ప్రయోజనకరం కాదు.

- అనిల్‌కుమార్, సీపీఎస్ ఉద్యోగి, వి.కోట

అబద్ధం.. అంతా అబద్ధం

'పాలారు' కోసం పరిపాలనా అనుమతులతో జీవో ఇచ్చింది నిజం. ఆ జీవోలో నిధుల కేటాయింపు చేసిందీ వాస్తవమే. కాకుంటే ఇది జరిగింది ఫిబ్రవరి 23న. ప్రకటించింది 26న. ఎన్నికల షెడ్యూల్ వచ్చింది మార్చి 17న. అదే సమయంలో పాలారు వివాదం కోర్టులో ఉన్నదీ నిజమే. ఇలా సమయం, సందర్భాన్ని చూస్తే ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టే అబద్ధపు హామీగా దీనిని చెప్పవచ్చు.

హంద్రీ నీవా గేట్లు ఎత్తింది నిజం. కొద్దిపాటి నీటిని వదిలిందీ వాస్తవమే. ఆపై కాలువ ఎండిందీ కళ్లకు కనిపించే సత్యం. కాకుంటే, కుప్పం నియోజకవర్గ ప్రజలకు నీటి సమస్యను తీర్చేశానన్నదే పెద్ద అబద్ధం. - కుప్పం

గణేశ్‌పురం పాలారు నదిపై రిజర్వాయర్ నిర్మా ప్రతిపాదిత ప్రాంతం ఇదే (ఫైల్ ఫొటో)



హంద్రీనీవా మాయ!

ముందుగా చెప్పినట్లే హంద్రీనీవా కాలువను పూర్తి చేశాను. కృష్ణాజలాలను ఈ కాలువ ద్వారా తీసుకొచ్చి కుప్పం నియోజకవర్గం నీటి కష్టం తీర్చాను

- మ్యానిఫెస్టో విడుదల సందర్భంగా ఇటీవల సీఎం జగన్ చేసిన ప్రకటన ఇది.



రామకుప్పం సమీపంలో చుక్కనీళ్లు లేని హంద్రీ-నీవా కాలువ

నిజం: కుప్పం హంద్రీనీవా కాలువలో చుక్క నీళ్లు లేవు. సీఎం జగన్ చెప్పినట్లు కాలువలోకి నీటి విడుదల నాటకం ఆడారు కానీ, సక్సెస్ కాలేదు. కనీసం నాలుగైదు కిలోమీటర్ల మేర కూడా ఆ నీళ్లు ప్రవహించకుండానే ఎండిపోయాయి. కుప్పంలో కరువు విలయతాండవం చేస్తోంది. ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కొద్దిపాటి నీటిని తీసుకొచ్చి.. కాలువకు అడ్డంగా కట్టలు కట్టి.. నిల్వ చేసి.. సెటప్ చేసిన గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు నాటకం ఆడారు. ఒక రోజుకు నాటకాన్ని బాగానే రక్తి కట్టించినా.. మరునాటికల్లా బండారం బయటపడిపోయింది. హంద్రీనీవా కాలువకు నీటి విడుదల అనేది జగన్నాటకమని లోకమంతా స్పష్టంగా తెలిసినా సరే, జగన్ ఒప్పుకోవడంలేదు. అందుకే.. మ్యానిఫెస్టో విడుదల సందర్భంగా హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసి హామీని నెరవేర్చినట్లు అబద్ధం అలవోకగా చెప్పేశారు. **కుప్పం**



తమిళనాడు రాష్ట్రం తిరుపత్తూరు కలెక్టరేట్ వద్ద రైతుల ధర్నా (ఫైల్ ఫొటో)

'పాలారు' నీళ్లు పారిస్తాం!

● కోర్టు పరిధిలోని అంశంపై పరిపాలనా అనుమతులు

● పదవీ కాలం చివర్లో జీవో జారీ

● పొరుగు రాష్ట్రాలతో అనవసర చిచ్చు

హంద్రీ నీవా ద్వారా కృష్ణా జలాలు తెచ్చేశాం. ఇక పాలారు ప్రాజెక్టు పెండింగులో ఉంది. దీనిన చిన్న రిజర్వాయరుగా 0.2 టీఎంసీ కెపాసిటీతో రూ.215 కోట్లతో నిర్మించేస్తాం. ఇప్పటికే మన ప్రభుత్వం పరిపాలనా అనుమతులు ఇచ్చేసింది.

- ఈ ఏడాది ఫిబ్రవరి 26వ తేదీన కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం జగన్ శాంతిపురం మండలంలో జరిగిన సభలో ఇచ్చిన హామీ ఇది.

పాలారు అనేది బహుళ ప్రాజెక్టుల నది. ఇది 1982లో కుదిరిన మద్రాసు-మైసూరు ఒప్పందంలో పేర్కొన్న అంతర్రాష్ట్ర నదులలో ఒకటి. 1892 నాటి అప్‌స్ట్రీమ్ స్టేట్‌స అగ్రిమెంట్ ప్రకారం దిగువ రాష్ట్రాల ముందస్తు అనుమతి లేకుండా అంతర్రాష్ట్ర నదులపై డ్యామ్‌ల నిర్మాణం లేదా నీటిని మళ్లించడానికి, నిల్వ చేయడానికి ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. ఇప్పటికే న్యాయస్థానాలలో ఈ పాలారు ప్రాజెక్టు వివాదంపై ఆంధ్ర-తమిళనాడు మధ్య కేసు నడుస్తోంది.

- జగన్ ప్రకటన చూసిన తర్వాత అదే ఫిబ్రవరి 27వ తేదీన తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ నీటిపారుదల శాఖమంత్రి దురై మురుగన్ చేసిన విస్పష్ట ప్రకటన ఇది.

ఈ రెండు ప్రకటనలను గమనించినవారికి ఎవరికైనా పాలారు ప్రాజెక్టు నిర్మాణంపై జగన్ అబద్ధపు ప్రకటన చేశారని ఇట్టే అర్థమైపోతుంది. అయన ప్రభుత్వం పరిపాలనా అనుమతులు అదే ఫిబ్రవరి నెల 23వ తేదీన విడుదల చేసింది నిజమే. అదే ఫిబ్రవరి నెల 29వ తేదీన సంబంధిత జీవోను ప్రభుత్వం బహిరంగ పరిచింది కూడా. కానీ కోర్టులో వివాదం నడుస్తున్నప్పుడు ఒక రాష్ట్ర ప్రభుత్వం పొరుగు రాష్ట్రాన్ని కనీసం సంప్రదించకుండా ఇలా ఏకపక్షంగా అనుమతులు ఎలా మంజూరు చేసిందన్నది ప్రశ్న. ఇలా అబద్ధపు హామీ ఇవ్వడమేకాక, దీనిని సమర్థించుకోవడానికి ఇలా చెల్లని జీవోలు విడుదల చేయడం కూడా జగన్‌కే చెల్లింది. మొత్తం రూ.214,81,00,000 గణేశ్‌పురం వద్ద పాలారు ప్రాజెక్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులు ఇస్తున్న జీవోలో ఏ పనికి ఎంతెంత నిధులు కేటాయిస్తున్నది కూడా స్పష్టంగా పేర్కొన్నారు. ఈ జీవో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీంతో తమిళనాడు రాష్ట్రం భగ్గుమంది. తిరుపత్తూరు కలెక్టరేట్ ఎదుట రైతులు, పాలారు ప్రాజెక్ట్‌కు వ్యతిరేకంగా మార్చి 1న ధర్నాకు దిగారు. కాగా, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ ప్రజలను ఇటువంటి హామీలు, ఉత్తుత్తి ప్రారంభోత్సవాలతో మభ్యపెట్టడం జగన్‌కు కొత్తకాదు. కాకుంటే పాలారు విషయం పక్క రాష్ట్రాలకు సంబంధించింది. దీంతో ఈ అంశం అంతర్రాష్ట్ర వివాదంగా మారిందంతే.

ఇదీ పాలారు కథ

కర్ణాటకలో ప్రారంభమయ్యే పాలారు నది, ఏపీ మీదుగా తమిళనాడుకు ప్రవహిస్తుంది. వర్షాకాలమప్పుడే జలాలు కనిపిస్తాయి. ఈ సమయంలో నీటిని నిల్వ ఉంచుకోవడానికి 2007లో అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కుప్పం మండలం గణేశ్‌పురం వద్ద పాలారునదిపై రిజర్వాయర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. దీనిపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టు గుమ్మం తొక్కింది. ఈ కేసు ఇప్పటికీ కోర్టులో నడుస్తోంది. దీంతో ఆ తర్వాత వచ్చిన ప్రభుత్వాలేవీ ప్రాజెక్టు విషయంలో ముందడుగు వేయలేదు.

ఇదంతా కుప్పం ప్రజలమీద ప్రేమేనా?:

ఇవన్నీ తెలిసినా సీఎం జగన్ ఈ జీవో ఎందుకు ఇచ్చినట్లు? ఇది అందరికీ వచ్చే ప్రశ్న. దీనికి జవాబు ఎన్నికల ముందు కుప్పం ప్రజలను మభ్యపెట్టడమే. పాలారు ప్రాజెక్టుతో తాను ప్రజలను ఉద్ధరిస్తున్నట్లు అనిపించాలి. మళ్లీ ఆ నిర్మాణంపై తాను ఇచ్చిన హామీ అమలు కాకుండా అడ్డుకుంటున్నదని నెపాన్ని తమిళనాడుపై తోసేయాలి. ఇరుగుపొరుగుగా ఉండి ఒకరితో ఒకరుగా సంబంధబాంధవ్యాలు కలిగివున్న ఇరు రాష్ట్ర ప్రజల మధ్య చిచ్చు పెట్టాలి. తాను మాత్రం అపర భగీరథుడిగా పేరు కొట్టేయాలి. ఈమధ్యలో కుప్పం ఓట్లు కొల్లగొట్టాలి. ఈ ప్లాన్‌తోనే పాలారు నాటకం ఆడారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

టీడీపీ ప్రభుత్వం వస్తేనే అభివృద్ధి..సంక్షేమం

రామకుప్పం, మే 4: టీడీపీ ప్రభుత్వం వస్తేనే రాష్ట్రంలో అభివృద్ధితో బాటు సంక్షేమ ఫలాలు అందరికీ అందుతాయని తెలుగురైతు కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, బీజేపీ జిల్లా కార్యదర్శి రాజ సింహా, జనసేన మండల అధ్యక్షుడు హరీష్‌లు తెలిపారు. శనివారం వారు రామకుప్పం పంచాయతీ మిట్టపల్లె, తిమ్మసముద్రం గ్రామాల్లో ప్రచారం చేశారు.

అభివృద్ధిని గుర్తించండి.. రుణం తీర్చుకోండి

రామకుప్పం, మే 4: చంద్రబాబు నేతృత్వంలో టీడీపీ పాలనలో మారుమూల గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని గుర్తించి, ప్రతి ఒక్కరూ ఆయన రుణం తీర్చుకునే సమయం ఆసన్నమైందని ఆ పార్టీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్ తెలియజేశారు. శనివారం వారు రామకుప్పం మండలం వీర్నమల పంచాయతీలో ఎన్నికల ప్రచారం చేశారు.

జోరుగా టీడీపీలో చేరికలు

రామకుప్పం, మే 4: రామకుప్పం మండలంలో ఎన్నికల రోజు సమీపిస్తున్న కొద్దీ టీడీపీలో చేరికలు జోరందుకున్నాయి. శనివారం వీరనాగపురానికి చెందిన నాగరాజు, సుబ్రహ్మణ్యం, రామచంద్ర, రమేష్, శివాజీ, సురేష్, శివ, తోటిశీనప్ప, సీబీనాగరాజు, పీఎంతాండాకు చెందిన వైసీపీ నేత బాబూనాయక్, నారాయణపురంతాండాకు చెందిన వైసీపీ యువత చిట్టిబాబునాయక్, శివతేజనాయక్, విజయకుమార్‌నాయక్, నల్లరాళ్లచేనుకు చెందిన వైసీపీ నేత గోవిందన్, వేములపల్లెకు చెందిన వైసీపీ నేతలు రాము, మణీగారులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ చిన్నికృష్ణ, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణానాయక్‌లు వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

బంగారు భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించండి

రామకుప్పం, మే 4: రాష్ట్రంలో యువత భవిష్యత్తు బంగారుమయంగా ఉండాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీ వైపు నిలబడాలని తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం కోరారు. శనివారం వారు మణీంద్రం, కెంచనబల్లల్లో యువతకు ఉద్యోగ, ఉపాధి కోసం బాబును మళ్లీ రప్పిద్దాం కార్యక్రమంలో భాగంగా ఇంటింటా యువతను కలిసి టీడీపీని గెలిపించాలని కోరారు.

శాంతిపురం : మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, మాజీ ఎంపీపీ ఉదయకుమార్, శాంతిపురం క్లస్టర్ ఇన్‌చార్జి విజయరామిరెడ్డి రాళ్లబూదుగూరు రెడ్డివారిపల్లె, సాతు, కెనమాకులపల్లె, మఠం, పొన్నేపల్లె, కడపల్లె, గ్రామాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ● అలాగే సీ.బండపల్లె పంచాయతీ చిన్నూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్ నేతలు, మండల దళిత నేతలు ఇంటింటా ప్రచారం చేశారు. ● మండలంలోని అన్ని పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఆయా పంచాయతీ నేతలు ముమ్మర ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చంద్రశేఖర్, రమేష్‌రెడ్డి, ఏఎంసీ నాగరాజు, బసవరాజు, జయరాజ్, ఈడిగ రమేష్, చలపతిస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

గుడుపల్లె, మే 4: కుప్పం-పొగురుపల్లె ప్రధాన రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికుల కథనం మేరకు.. కనమనపల్లెకు చెందిన కిట్టప్ప కుమారుడు షణ్ముగం(21) కుప్పం సమీపంలోని ఓ ప్రైవేటు ఫ్యాక్టరీలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్ర వారం రాత్రి విధులు ముగించుకొని తన ద్విచక్ర వాహనంలో కనమనపల్లెకు బయలు దేరాడు. మార్గ మధ్యంలోని గుండ్లసాగరం సమీపంలోని రోడ్డుపక్కనున్న విద్యుత్‌పోల్‌ను అదుపు తప్పి ఢీకొన్నాడు. పెట్రోలింగ్ పోలీసులు కుప్పంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తర్వాత కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

బాబు రుణం తీర్చుకుందాం

కుప్పం, మే 4: టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ 2వ వార్డు పరిధిలోని శీగలపల్లె, యలాజనూరులో శనివారం ప్రచారం చేశారు. అభివృద్ధి ప్రదాత బాబురుణం తీర్చుకుందామని కోరారు.

మళ్లీ వైసీపీ వస్తే భూములు స్వాహా: అమర్




టీడీపీలో చేరిన గణేష్ యువసేన నాయకులు, కమ్మనపల్లె పంచాయతీలో ఎన్నికల ప్రచారంలో టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, మే 4 : మండలంలోని కమ్మనపల్లె, పెద్దచెల్లారగుంట పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద రావును, ఎమ్మెల్యే అభ్యర్థి అమరనాథరెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ జడ్పీటీసీ రాధమ్మ, బోయకొండ ఆలయ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు: పలమనేరుకు చెందిన బిల్డర్ గణేష్ యువసేనకు చెందిన నాయకులు శనివారం అమరనాథరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. గణేష్ ఇటీవల వైసీపీలో చేరడంతో ఇది నచ్చని గణేష్ యువసేన నాయకులు అనిల్‌రాయల్, మురళి, వెంకటేష్ అలియాస్‌దాము, అశోక్, రమేష్, యుగేంద్ర, లోకేష్, ముని, వెంకటరెడ్డి, మంజునాథగౌడు, జ్ఞానేంద్ర, శివా, దినేష్, భార్గవ్, అభి తదితరులు టీడీపీలో చేరారు. పార్టీలోచేరిన వారందరికీ అమరనాథరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

గంగవరం: గంగవరం మండలంలోని చీళ్లవారిపల్లెలో అమరనాథరెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛను రూ.4 వేలు ఇస్తామన్నారు. కొత్తప్రభుత్వం ఏర్పడిన తరువాత ఈ మూడు నెలలకు కూడా నెలకు వెయ్యి రూపాయలు చొప్పున పెరిగిన పెన్షన్‌తో కలిపి జూలైలో రూ.7 వేలు పెన్షన్ ఒకేసారి అందిస్తామని ఆయన తెలియజేశారు. ముఖ్యంగా ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేస్తామని తెలియజేశారు. అనంతరం చీళ్లవారిపల్లె గ్రామానికి చెందిన మునివెంకటప్ప, చరణ్, సురేంద్ర, గంగాధర్, సుబ్బయ్య, అమరనాథ్ హరీష్, గోపాల్, భరత్, గంగిరెడ్డి, బాలాజి, చెంగప్ప, సుగుణమ్మ, రూప, లోకేశ్వరి తదితరులు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. టీడీపీ మండల అధ్యక్షులు సోమశేఖర్‌గౌడ్, ప్రసాద్‌నాయుడు, ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగస్తులారా.. ఆలోచించి ఓటేయండి: టీడీపీ



మాట్లాడుతున్న పీఎస్ఎం, సురేశ్‌బాబు తదితరులు

కుప్పం, మే 4: తమకు, తమ ఉద్యోగాలకు ఎవరు భద్రత కల్పిస్తారో ఆలోచించి ఉద్యోగస్తులం దరూ ఓటు వేయాలని టీడీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, పార్టీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబులు పేర్కొన్నారు. కుప్పంలోని ఫెసిలిటేషన్ సెంటర్ అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆది, సోమ వారాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే ప్రక్రియ జరుగుతుందన్నారు. పోలింగ్ విధులకు హాజరు కానున్న ప్రతి ఒక్క ఉద్యోగీ తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఫిట్‌మెంట్, పీఆర్సీ, డీఏలు, ఇతర ప్రయోజనాలు.. ఇలా ప్రతి విషయంలోనూ జగన్ రెడ్డి ఉద్యోగస్తులను మోసం చేశారని గుర్తుచేశారు.. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలన్నింటినీ తుంగలో తొక్కడమే కాకుండా, ఉద్యోగులను శత్రువులుగా పరిగణించి మానసిక హింసకు గురి చేశారన్నారు. అదే సమయంలో చంద్రబాబు వంటి నాయకుడిని ఎన్నుకుంటే వారి ప్రయోజనాలు వారికి తిరిగి అందుతాయని హామీ ఇచ్చారు.

మున్సిపల్ ఆదాయానికి గండి

కుప్పం పురపాలక సంఘం నిర్వహించే గేటు వసూళ్లకు సంబంధించి వైసీపీ నాయకులు అబద్ధపు హామీలతో మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టారని డాక్టర్ సురేశ్‌బాబు ఆరోపించారు. దినసరి కూరగాయల మార్కెట్, వారపు సంత, జంతు వధశాల, ప్రైవేట్ బస్టాండులో పార్కింగ్ రుసుము వసూలు అనే నాలుగు అంశాలకు సంబంధించి టెండర్లు నిర్వహిస్తుంటారని పేర్కొన్నారు. అయితే 2023-2024 ఆర్థిక సంవత్సరానికి టెండర్లు నిర్వహించకుండానే కుప్పం రెస్కో ఉద్యోగిగా ఉండి ఇటీవల సస్పెన్షన్‌కు గురి అయిన గిరిధర్ అనే వ్యక్తికి గేటు వసూళ్ల లీజును కట్టబెట్టారని ఆరోపించారు. ఆయన ఇంతవరకు కేవలం రూ.11.50 లక్షలు మాత్రమే మున్సిపాలిటీకి చెల్లించారని చెప్పారు. చిరు వ్యాపారుల నుంచి గేటు వసూళ్లు ఇక ఉండవని, వారందరూ ఉచితంగానే మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారం చేసుకోవచ్చని ఎంపీ మిథున్‌రెడ్డి చెప్పడమేకాక, తాను స్వయంగా రూ.75 లక్షలు వారి తరఫున మున్సిపాలిటీకి చెల్లిస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అయితే ఆయన ఇంతదాకా ఒక్క పైసా కూడా చెల్లించలేదన్నారు. ఈ మోసానికి మున్సిపల్ చైర్మన్ డాక్టర్ సుధీర్‌తోపాటు వైసీపీ నాయకులందరూ బాధ్యత వహించాలని తెలియజేశారు. మళ్లీ ఈ ఆర్థిక సంవత్సరంలో కూడా టెండర్లు లేకుండా తమ మనుషులకు గేటు వసూళ్ల లీజును కట్టబెట్టడానికి కుట్ర జరుగుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇటువంటి మోసాలు జరగవని, పైగా మున్సిపల్ ఆదాయాన్ని పెంచి తద్వారా ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, వెంకటరమణబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ ప్రచారరథం బోల్తా

రామకుప్పం, మే 4: రామకుప్పం మండలం గురుకులమడుగు-రామాపురంతాండాల మధ్య శుక్రవారం రాత్రి టీడీపీ ప్రచారరథం బోల్తా పడింది. ఆ రెండు గ్రామాల రహదారి మధ్య ఉన్న ప్రమాదకర మలుపు వద్ద ప్రచార రథం డ్రైవర్ ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని తప్పించబోయాడు. ఆ ప్రయత్నంలో ప్రచారరథం రోడ్డుపక్కన బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంతో తప్పించుకోవడంతో అతడికి ఎటువంటి గాయాలు కాలేదు.

ముస్లిం ద్రోహి అసదుద్దీన్ ఓవైసీ



మాట్లాడుతున్న గాజుల ఖాదర్‌బాషా

రామకుప్పం, మే 4: ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ముస్లిం ద్రోహి అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజులఖాదర్‌బాషా విరుచుకుపడ్డారు. శనివారం ఆయన రామకుప్పంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏపీలో జగన్‌కు మద్దతు ఇవ్వాలని అసదుద్దీన్ ఓవైసీ ముస్లింకు పిలుపునివ్వడం దారుణమన్నారు. ముస్లింలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించడానికి వ్యతిరేకంగా సీఎం జగన్ ఎంపీ ఆర్‌కృష్ణయ్యచే సుప్రీంకోర్టులో కేసు వేయించారని తెలియజేశారు. అంతేగాక ముస్లింలకు టీడీపీ పాలనలో అమలైన అన్ని సంక్షేమపథకాలను జగన్ రద్దు చేశారన్నారు. చంద్రబాబు ఎప్పుడూ ముస్లిం మైనారిటీల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం కృషి చేశారని వివరించారు. ముసిలంతా సైకిల్ గుర్తుకు ఓటేసి చంద్రబాబును భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ముస్లిం నేతలు మహ్మద్‌రఫీ, మునాఫ్, సలాంసాబ్, ఆదిల్, నిసార్, జలీల్‌సాబ్, అక్బర్‌సాబ్, చాన్‌బాషా, హనీఫ్, అప్సా, సలాం, హఫీజ్, హీరాబాషా పాల్గొన్నారు.

సీఎం కాన్వాయ్ వెనుక పరిగెడుతూ బోల్తాపడ్డ అభిమాని



గాయపడిన చలపతి

గంగవరం, ఏప్రిల్ 4: సీఎం కాన్వాయ్ వెనుక పరిగెడుతూ చోటుచేసుకున్న తోపులాటలో ఓ అభిమానికి తీవ్రగాయాల య్యాయి. బంగారుపాళ్యం మండలం పాలమాకులపల్లెకు చెందిన వైసీపీ అభిమాని చలపతి జగన్ సభకు హాజరయ్యాడు. జగన్ ప్రసంగం పూర్తవగానే బస్సుయాత్ర ప్రారంభమైంది. బస్సువెనుకనే పరుగెత్తాడు. మదన పల్లె రోడ్డులోని రఘువీరారెడ్డి కాలనీ వద్ద తోపులాటలు జరగడంతో కాన్వాయ్ ముందు బోల్తాపడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అతడిని పక్కకకు లాగి ప్రాణాలు కాపాడగలిగారు. వెంటనే అక్కడే ఉన్న అంబులెన్సులో చికిత్సలు అందించి పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉద్యోగావకాశాలకు కేఈసీ సింహద్వారం

కుప్పం, మే 4: ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కుప్పం ఇంజినీరింగు కళాశాల సింహద్వారమని బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ అన్నారు. కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 2023-2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్లేస్‌మెంట్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా వంద శాతం ఉద్యోగాలను పొందడంలో కేఈసీ ప్రథమ స్థానం సాధించిందని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో ఐటీ, కోర్ తదితర రంగాలలో సుమారు 50 పైగా ఎంఎన్‌సీ కంపెనీలలో 366 ఆన్ క్యాంపస్ ప్లేస్‌మెంట్లు అందించామన్నారు. కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ ఎస్.సునీల్‌రాజ్, ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.భాస్కరన్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జయకుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కటింగ్ మిషన్ తగిలి తీవ్రగాయం

పలమనేరు, మే4 : కటింగ్ మిషన్ ప్రమాద వశాత్తు తగలడంతో ఓ వ్యక్తి కడుపుపై తీవ్రగాయమైంది. వెదురుకుప్పం మండలం గంగిరెడ్ల ఇండ్లు గ్రామానికి చెందిన జనార్దనరెడ్డి నాలుగురోడ్ల సమీపంలోని పారిశ్రామిక వాడలో కొయ్యలు కత్తిరించే సందర్భంలో కటింగ్ మిషన్ తగిలి కడుపుపై తీవ్రగాయమైంది. అతడిని పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

సీఎం సభలో పోలీసుల ఓవర్‌యాక్షన్

- జెండాలు పట్టినవారికి రోడ్డుపైకి.. రైట్ రైట్
- స్థానికులకు నో ఎంట్రీ



స్థానికులను అడ్డుకుంటున్న పోలీసులు

గంగవరం, ఏప్రిల్ 4: ముఖ్యమంత్రి సభ సందర్భంగా పోలీసుల ఓవర్‌యాక్షన్ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. శనివారం సీఎం జగన్ వస్తున్నారని ఉదయం 9 గంటల నుంచే భారీ వాహనాలను బైపాస్ రోడ్డుగుండా మళ్లించారు. మధ్యాహ్నం సుమారు 1.40 నిమిషాలకు ముఖ్యమంత్రి జగన్ పలమనేరుకు చేరుకున్నారు. పోలీసులు మాత్రం మధ్యాహ్నం 12 గంటల నుంచే ఎక్కడికక్కడ బ్యారికేడ్లను ఏర్పాటు చేసి వీధుల్లో నుంచి జనం రోడ్లపైకి రాకుండా చేశారు. ముఖ్యంగా అంబేడ్కర్ సర్కిల్, జవిళివీధి క్రాస్, రంగమహల్ క్రాస్, దండపల్లె క్రాస్ వద్ద పోలీసులు స్థానికుల వాహనాలను అడ్డుకున్నారు. పోలీసుల తీరుతో అంబేడ్కర్ సర్కిల్ నుంచి ద్విచక్రవాహనదారులు తిరుగు ప్రయాణమై బొమ్మిదొడ్డి మీదుగా గుడియాత్తంరోడ్డు, పాతపేట, కాలేజీరోడ్డుల గుండా అష్టకష్టాలు పడి 100 మీటర్ల దూరంలో ఇళ్లు ఉన్నవారు కూడా సుమారు 5 కిలోమీటర్లు చుట్టుతిరిగి ఇళ్లకు చేరుకోవాల్సివచ్చింది. అయితే వైసీపీ టోపీలు, జెండాలు చేతపట్టుకున్న వాహనదారులను మాత్రం వదిలేశారు. ఇక ఆటోలను పూర్తిగా కదలనివ్వలేదు. రెండు గంటల పాటు తీవ్ర అవస్థలు పడ్డామని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎన్నికల విధులు అప్రమత్తంగా నిర్వహించాలి

పుంగనూరు, మే4: ఈనెల 13నజరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు అప్రమత్తంగా విధులు నిర్వహించాలని పుంగనూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.మధుసూధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక బసవరాజ ప్రభుత్వ హైస్కూల్‌లో ఎన్నికల విధులకు హాజరయ్యే ఉపాధ్యాయులు, తదితరులతో ఆయన మాట్లాడారు. ఈవీఎం మిషన్ల నిర్వహణ, పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలింగ్ అధికారులు వివాదాలు, ఆరోపణలకు తావివ్వరాదని సూచించారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే పోలింగ్ అధికారులకు 8మంది ప్రత్యేక శిక్షకుల ద్వారా నియోజకర్గంలోని 640 మందికి అవగాహన, సూచనలతో శిక్షణ ఇచ్చారు. ఈ సమావేశంలో తహసీల్దార్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం



కొర్లకుంటవారిపల్లెలో ప్రచారం చేస్తున్న చల్లా బాబు

చౌడేపల్లె, మే1: సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం అని టీడీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి సోదరి వీణారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆమె మండలంలోని కొండయ్యగారిపల్లె, చారాల పంచాయతీలో ఇంటింటా ప్రచారం చేశారు. ● గడ్డంవారిపల్లెలో పంచాయతీ టీడీపీ మండలాధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి అమ్మ రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో ప్రతి పల్లెలోనూ స్థానిక టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపతిరాజు, మాజీ ఎంపీపీ చంద్రవదనమ్మ, నాయకులు ప్రదీప్, కళ్యాణ్, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సోమల: ఎన్‌డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని బీజేపీ నియోజక వర్గం కన్వీనర్ గన్నా మదన్ మోహన్‌బాబు కార్యకర్తలతో కలసి పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, పంచాయతీలోని గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతి, జనసేన మండల అధ్యక్షుడు నాగభూషణం రాయల్, వినోద్ కుమార్ పాల్గొన్నారు. ● కందూరు, సోమల పంచాయతీల్లో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, ఉపాధ్యక్షుడు పీఎం.మల్లికార్జున ప్రచారం నిర్వహించారు.

పుంగనూరు రూరల్: పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాని రాజంపేట పార్లమెంటు జనసేన కన్వీనర్ శ్రీనివాసరాజు కోరారు. పుంగనూరులో జనసేన కార్యకర్తలతో ఆయన వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, నరేశ్‌రాయల్, చిన్నారాయల్, తదితరులు పాల్గొన్నారు.

సదుం: సదుం మండలంలోని తిమ్మానాయునిపల్లె పంచాయతీలో టీడీపీ పుంగనూరు ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి ప్రచారం నిర్వహించారు. వైసీపీ అక్రమాలు ఆగాలంటే ఉమ్మడి ప్రభుత్వం రావాలన్నారు.

రొంపిచెర్ల: గానుగచింత పంచాయతీలోని జగడంవారిపల్లె, నగిరిగూడెం, దళితవాడ, కమ్మపల్లె గ్రామాల్లో చల్లారామచంద్రారెడ్డి సతీమణి చల్లా సుప్రియారెడ్డి ఇంటింటా ప్రచారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రమణ, నాయకులు క్రిష్ణమనాయుడు, శేషాద్రినాయుడు, ముద్దుక్రిష్ణ, నౌషాద్‌బాష పాల్గొన్నారు.

కల్లూరు: చల్లా బాబును గెలిపించాలని ఆయన కుమార్తె చల్లా పూజారెడ్డి పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పంచాయతీలో ప్రచారం చేశారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి



తగ్గువారిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న మండల అధ్యక్షుడు జయప్రకాష్

బంగారుపాళ్యం, మే 4: రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తేనే పల్లెసీమలు ప్రగతిబాటలో పయనిస్తాయని మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ అన్నారు. శనివారం మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ, బొమ్మాయిపల్లె, కీరమంద, ఈచనేరిపల్లె, తుంబకుప్పం తదితర గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, ఎమ్మెల్యే అభ్యర్థి మురళీమోహన్‌లను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జయచంద్ర నాయుడు, ధరణి, కోకాప్రకాష్ నాయుడు, లోకనాథం నాయుడు, హేమచంద్రనాయుడు, అమరావతి, చందు, జాకీర్‌హుస్సేన్, నీరజాక్షులు గౌడ్, రాధిక, బాలు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామాలను ఆమోదించారా..?

గ్రామ వలంటీర్ల రాజీనామాలను ఆమోదించారా అని ఎంపీడీవో శివశంకర్‌ను ఎన్‌పీ జయప్రకాష్ నిలదీశారు. తగ్గువారిపల్లెతో పాటు పలు పంచాయతీలకు చెందిన వలంటీర్లు రాజీనామా చేసిన విషయం విదితమే. ఎంపీడీవో మాట్లాడుతూ వలంటీర్ల రాజీనామా పత్రాలను జిల్లా అధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు. మండల అధ్యక్షుడితో పాటు జయచంద్రనాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, హేమచంద్ర నాయుడు, జనార్దన్ గౌడ్‌లు ఉన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తే ఒక్కో రైతుకు ఏడాదికి రూ.20 వేలు



రైతుతో మాట్లాడుతున్న గురజాల జగన్‌మోహన్

గుడిపాల, మే 4: టీడీపీ అధికారంలోకి రాగానే రైతులకు ఏడాదికి రూ.20వేలను ఇస్తామని చిత్తూరు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ అన్నారు. శనివారం మండలంలోని బొమ్మసముద్రం, మండి కృష్ణాపురం, చెరుకూరి కండ్రిగ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. అనంతరం బసవాపల్లె దళితవాడకు చెందిన వైసీపీ నాయకులు పీటర్, డేవిడ్, సురేష్, రాజేష్‌కుమార్‌లు టీడీపీలో చేరారు. టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంనాయుడు, ఉపాధ్యక్షుడు అనిల్ కుమార్, మాజీ జడ్పీటీసీ బాలాజినాయుడు, టీడీపీ నేతలు వెంకటేష్ యాదవ్, సాంబశివనాయుడు, గోళ్ల హరిప్రసాద్ చౌదరి, శరత్, బాలాజీ, విక్టోరియా, చంద్రమోహన్, రవి, మురళి, జనసేన , బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చిత్తూరు సిటీ: నగరంలోని చర్చివీధి, మార్కెట్ చౌక్ తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ ప్రచారం నిర్వహించారు. టీ వేసి, దోశలు పోస్తూ ప్రజలతో ఆప్యాయం మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నగరంలోని 24వ డివిజన్ పరిధిలో మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఆయన కుమారుడు సీకే సాయి కృష్ణారెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ అశోక్, మాజీ కార్పొరేటర్ మురళి, సుబ్రమణి, హేమంత్, రహ్మతుల్లా, బాబు పాల్గొన్నారు.

చదరంగం మేధస్సును పెంచుతుంది : జేవీవీ

చిత్తూరు (సెంట్రల్), మే 4: చదరంగం మేధస్సును పెంచుతుందని జనవిజ్ఞాన వేదిక (జేవీవీ) వక్తలు పేర్కొన్నారు. జేవీవీ ఆధ్వర్యంలో పది రోజుల పాటు నిర్వహించిన వేసవి శిక్షణా శిబిరం ముగింపు, బహుమతుల ప్రదానోత్సవం శనివారం స్థానిక విజయం డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ గోల్డ్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ చదరంగం మనలోని మేధాశక్తిని పెంచడంతోపాటు మానసిక ఉల్లాసం ఇస్తుందన్నారు. అనంతరం చెక్ క్రీడల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ ఉపాధ్యక్షుడు, జెడ్ఎస్ఎస్ జిల్లా కోఆర్డినేటర్ త్యాగరాజులు , జేవీవీ నగర అధ్యక్షుడు సుధాకర్, విజయ్‌కుమార్, ఉమాపతి, వేణుగోపాల్, మునిరత్నం, రంగనాథం, విజయం డిగ్రీ కళాశాల అకడమిక్ కోఆర్డినేటర్ రమణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల క్రీడలు ప్రారంభం



షాట్‌పుట్ ఆడుతున్న జిల్లా జడ్జి భీమరావు

చిత్తూరు లీగల్, మే 4: న్యాయవాదుల క్రీడలను శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ. భీమరావు ప్రారంభించారు. శనివారం స్థానిక మెసానిక్ గ్రౌండ్‌లో క్రీడలను ప్రారంభించారు. అలాగే ఆయన కొంతసేపు, షాట్‌పుట్, టగ్ ఆఫ్ వార్ ఆటలను ఆడి న్యాయవాదులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు శ్రీనివాసరావు, బాబాజాన్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు రాజేంద్ర రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్ ఆనంద్ యాదవ్, పలువురు న్యాయవాదుల సంఘ నేతలు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గడ్డివామి దగ్ధం

వెదురుకుప్పం, మే4: వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగుకు చెందిన గోవిందస్వామి గడ్డివామి శనివారం ఆకస్మాత్తుగా కాలిబూడిదైయిందని ఆ గ్రామస్తులు తెలిపారు. పశువుల కోసం గ్రామ సమీపంలో నిల్వ ఉంచిన గడ్డి వామి కాలిపోయిందని, దీంతో ఆ పాడిరైతుకు గడ్డి లేకుండా పోయిందని చెప్పారు. సుమారు రూ.25వేలు నష్టం వాటిల్లిందని చెప్పారు.

కురివికుప్పంలో టీడీపీ ప్రచారం

వెదురుకుప్పం, మే 4: ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావులను గెలిపించాలని తెలుగుదేశం పార్టీ ఎస్ఆర్‌పి జీడీనెల్లూరు నియోజకవర్గ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్ కోరారు. శనివారం వెదురుకుప్పం మండలం కురివికుప్పంలో ప్రచారం చేపట్టారు. ఈ క్రమంలో టీడీపీ సూపర్ సిక్స్ కరపత్రాలను అందజేశారు. ప్రచార కార్యక్రమంలో సర్పంచ్‌లు శ్రీనాథరెడ్డి, అబ్బులురెడ్డి టీడీపీ నేతలు బండి విష్ణువర్ధన్‌రెడ్డి, సేతురెడ్డి, బట్టే చాణిక్య ప్రతాప్, గాలి బాబునాయుడు, జనసేన నాయకులు యతీశ్వర రెడ్డి, సతీష్, ముని, పురుషోత్తం పాల్గొన్నారు.

నేడు దేవర ఎద్దు నిర్యాణ ఆరాధన

వెదురుకుప్పం, మే4:వెదురుకుప్పం మండలం నల్లవెంగనపల్లె పంచాయతీ కొండారెడ్డివూరులో దేవర ఎద్దు(వృషభ) ఇటీవల మరణించింది. ఆనవాయితీ ప్రకారం వృషభ నిర్యాణ ఆరాధన కార్యక్రమాన్ని ఆదివారం ఆ గ్రామంలో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలో ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలను కొండారెడ్డివూరులో కనుగొండరాయ స్వామి ఆలయం వద్ద జరుగుతాయని చెప్పారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు, మే 4: స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశానికి విద్యార్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏఎస్ రేఖ తెలిపారు. మూడో తరగతిలో 40 సీట్లకు గాను ఎస్టీలకు 32, ఎస్సీలకు 05, బీసీలకు 02, ఓసీలకు 01 సీటు ప్రభుత్వం కేటాయించిందన్నారు. నాల్గో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు వున్న బ్యాక్‌లాగ్ ఖాళీలను ఎస్టీ విద్యార్థినులతో భర్తీ చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 20వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9493671950, 9441948171 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

కటింగ్ మిషన్ తగిలి తీవ్రగాయం

పలమనేరు, మే4 : కటింగ్ మిషన్ ప్రమాద వశాత్తు తగలడంతో ఓ వ్యక్తి కడుపుపై తీవ్రగాయమైంది. వెదురుకుప్పం మండలం గంగిరెడ్లు ఇండ్లు గ్రామానికి చెందిన జనార్దనరెడ్డి నాలుగురోడ్ల సమీపంలోని పారిశ్రామిక వాడలో కొయ్యలు కత్తిరించే సందర్భంలో కటింగ్ మిషన్ తగిలి కడుపుపై తీవ్ర గాయమైంది. అతడిని పలమనేరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు.

ఐదేళ్ళలో దోచేశారు



- చిత్తూరు నుంచి పెద్దఎత్తున కర్ణాటక, తమిళనాడుకు ఇసుక
- మామూళ్లు ఇవ్వలేక 75శాతం మైన్స్, జెల్లి ఫ్యాక్టరీల మూత
- మున్సిపల్ ఎన్నికల్లో అక్రమంగా ఏకగ్రీవాలు
- హక్కుల్ని కాపాడుకోవాలంటే టీడీపీని గెలిపించండి
- సేవా దృక్పథమున్న వ్యక్తి గురజాల జగన్మోహన్
- టీడీపీ సీనియర్ నాయకుడు చంద్రప్రకాష్

చిత్తూరు రూరల్, మే 4: గత ప్రభుత్వ హయాంలో సతీమణి గీర్వాణి జడ్పీ ఛైర్‌పర్సన్‌గా పరిపాలనా బాధ్యతలు చూసుకుంటే, ఆయన మాత్రం జిల్లా పార్టీ శ్రేణులకు అందుబాటులో ఉంటూ వారి అవసరాలు, బాగోగులు చూసుకుంటూ పార్టీ పటిష్టానికి కృషి చేశారు. ఈసారి చిత్తూరు రూరల్ మండలంలో టీడీపీకి మంచి మెజార్టీ తెచ్చేందుకు పనిచేసుకుంటూ పోతున్నారు. చిత్తూరు టికెట్ ఆశించిన టీడీపీ సీనియర్ నేత చంద్రప్రకాష్, గురజాలకు టికెట్ రావడంతో ఆయన గెలుపు కోసం కృషి చేస్తున్నారు. చిత్తూరులో టీడీపీని గెలిపించాల్సిన అవసరం ఉందంటున్న ఆయనతో ఆంధ్రజ్యోతి ప్రత్యేక ఇంటర్వ్యూ..

● వైసీపీ నాయకులు ఇలా దోచుకున్నారు

చిత్తూరు రూరల్ మండలంలోని ఎన్ఆర్‌పేట, అనంతాపురం, ఆనగల్లు, ముత్తుకూరు ప్రాంతాల్లోని రీచుల నుంచి విచ్చలవిడిగా తమిళనాడు, కర్ణాటక ప్రాంతాలకు ఇసుక తరలివెళ్తోంది. రీచ్ పక్కనే ఉన్న రైతుకు ట్రాక్టర్ ఇసుక కావాలంటే రూ.5 వేలు పడుతోంది. నియోజకవర్గంలోని మైన్స్, జెల్లి ఫ్యాక్టరీలు 75శాతం మూతపడిపోయాయి. ఆయా యజమానులు పెద్దిరెడ్డికి నెల మామూళ్లు కట్టలేక మూతేసేశారు. ఈ ఐదేళ్లలో వైసీపీ నాయకులు పెద్దఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారు. మట్టి గుట్టలన్నీ కరిగిపోయాయి.

● దొంగ సంతకాలతో ఏకగ్రీవాలు

చిత్తూరులో మూడేళ్ల కిందట జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో స్థానిక వైసీపీ నాయకులు అనేక అక్రమాలకు పాల్పడ్డారు. అభ్యర్థుల దొంగ సంతకాలను పెట్టేసి 36 డివిజన్లను అక్రమంగా ఏకగ్రీవం చేసుకున్నారు. నామినేషన్ వేసినవారిని పోలీసులతో బెదిరించారు.

● చిత్తూరు ప్రజలు స్వేచ్ఛగా బతకలేకపోయారు

ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో ఒక్కటీ చెప్పుకోదగ్గ అభివృద్ధి జరగలేదు. నిరసనలు చేసిన ప్రతిపక్షాలను, ఉద్యోగులను అక్రమ కేసులతో వేధించారు. చిత్తూరులో ఐదేళ్ల పాటు రాక్షస పాలన సాగింది. మనిషి స్వేచ్ఛగా బతకాలంటే టీడీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది.

● గురజాలను ఎందుకు గెలిపించాలంటే..

చిత్తూరు నియోజకవర్గంలో జరిగిన అక్రమాల్లో పెద్దిరెడ్డితో పాటు వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డికి కూడా వాటాలు వెళ్లాయి. టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ మంచి వ్యక్తి. సేవా కార్యక్రమాల్లో ముందుంటారు. సొంత ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని రాజకీయాల్లో వచ్చారు. అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. అందుకే సీనియర్లమంతా అతనికి తోడుగా ఉన్నాం. ప్రజాస్వామ్యాన్ని, వారి హక్కుల్ని కాపాడుకోవాలంటే గురజాల జగన్మోహన్‌కు ఓటేసి గెలిపించుకోవాలి.

దళితులను దగా చేసిన వైసీపీ ప్రభుత్వం

మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు

చిత్తూరు సిటీ, మే 4: వైసీపీ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను దగా చేసిందని మాల మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు విమర్శించారు. శనివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ ప్రకటించింది నవరత్నాలు కాదని, అవి సమాధి రాళ్లని ధ్వజమెత్తారు. నా ఎస్సీలు, నాఎస్టీలు, నా బీసీలు అని చెప్పుకునే జగన్ వారికోసం ప్రత్యేకంగా ఎటువంటి పథకాలను అమలు చేయలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వైసీపీ ప్రభుత్వం పక్కదారి మళ్లించిందని పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలపైనే అత్యధికంగా దాడులు జరిగాయని చెప్పారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసీపీని వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు. టీడీపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులను భారీ విజయంతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీ అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్, దళిత ప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు కె.ధనుంజయరావు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి, జిల్లా అధ్యక్షుడు విజయభాస్కర్, మాల మహాసభ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, చిట్టిబాబు, ఉష, రోజ తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లెల వెంకట్రావు

ఆట మొదలైంది

- ముఖ్య నాయకులను కోల్పోయిన వైసీపీ
- గందరగోళంలో కేడర్
- పక్క చూపులు చూస్తున్న చోటా నాయకులు
- నేడు విజయపురంలో కీలక సమావేశం

పుత్తూరు అర్బన్, మే 4: నగరిలో ఆట మొదలైంది... పోలింగ్‌కు గడువు సమీపిస్తున్న కొద్దీ ఫ్యాన్ పార్టీ ముఖ్య నాయకులను కోల్పోతుండడంతో వైసీపీ కేడర్ గందరగోళంలో పడింది. ఈ పరిణామం ఎన్నికల ఫలితాలపై స్పష్టం కానుండడంతో చోటా నాయకులు పక్క చూపులు చూస్తున్నారు. వీరిని గోడ దూకకుండా ఆపేందుకు మంత్రి రోజా క్యాంప్ పడరాని పాట్లు పడాల్సి వస్తోందనే మాటలు వినబడుతున్నాయి. మరోవైపు వైసీపీకి గుడ్‌బై చెప్పిన మంత్రి రోజా వ్యతిరేకవర్గం ఆదివారం మధ్యాహ్నం విజయపురం మండలంలోని నెహ్రూనగర్‌లోని లక్ష్మీపతిరాజు నివాసంలో కీలక సమావేశం నిర్వహించనుంది. నగరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సైతం ఈ సమావేశానికి హాజరుకానున్నారు. పలువురు మండల స్థాయి నాయకులు వైసీపీ నుంచి టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ సమావేశం నుంచే మంత్రి రోజాను ఓడించేందుకు కార్యాచరణ రూపొందించనున్నారు.

భీష్మ ప్రతిజ్ఞ...

రాజకీయంగా తమ ఉనికిని ప్రశ్నార్థకంగా మార్చిన మంత్రి రోజాను ఓడించి తీరుతామని అసమ్మతి నాయకులు గతంలోనే భీష్మ ప్రతిజ్ఞ చేశారు. దీంతో ఒక్కొక్కరు వైసీపీ నుంచి బయటకు రావడం మొదలైంది. తొలుత పుత్తూరు మాజీ ఎంపీపీ డీఎన్ ఏలుమలై పార్టీని వీడగా, శుక్రవారం శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మాజీ ఛైర్మన్ రెడ్డివారి చక్రపాణిరెడ్డి, వడమాలపేట జెడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, విజయపురం లక్ష్మీపతిరాజు రాజీనామాలు సమర్పించారు.

వేదికకానున్న విజయపురం..

2019 ఎన్నికల ముందు జనవరిలో విజయపురం మండలంలోని లక్ష్మీపతి రాజు గృహంలో వైసీపీ నాయకుల సమావేశం జరిగింది. అప్పటి ఎమ్మెల్యే రోజాతో నియోజకవర్గానికి చెందిన నాయకులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, డీఎన్ ఏలుమలై, రవిశేఖర్‌రాజుల మధ్య ఉన్న మనస్పర్థలు తొలగించుకుని ఎన్నికల్లో తలపడేందుకు లక్ష్మీపతిరాజు దౌత్యం జరిపారు. ఐదేళ్ల తరువాత సరిగ్గా అక్కడే మంత్రి రోజాను ఓడించేందుకు ఆమె వ్యతిరేకవర్గం సమావేశం కానుంది.

ఒడిసిపట్టుకున్న భానుప్రకాష్...

వైసీపీలో నెలకొన్న గందరగోళ పరిస్థితులను తనకు అనుకూలంగా మలుచుకోవడంలో ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పూర్తిస్థాయిలో సఫలీకృతులయ్యారనే మాటలు వినబడుతున్నాయి. తొలుత గత రెండు ఎన్నికల్లో టీడీపీ ఓడిపోవడంతో ఈదఫా గెలుపు కోసం కసి మీదున్న కేడర్‌ను ఎన్నికల రణరంగానికి సంసిద్ధం చేసుకున్న ఆయన ఆ తరువాత వైసీపీని రాజకీయంగా కోలుకోలేని దెబ్బ కొట్టేందుకు స్కెచ్‌గీశారు. ఇందులో భాగంగా మంత్రి రోజాపై అసంతృప్తితో ఉన్న నాయకులను తనవైపుకు తిప్పుకునేందుకు పావులు కదిపారు. ఈ క్రమంలో భానుప్రకాష్ వేసిన రాజకీయ ఎత్తుగడలు వైసీపీకి శరాఘాతంగా పరిణమించాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పీహెచ్‌సీని సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌వో

విజయపురం : విజయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంఅండ్‌హెచ్‌వో ప్రభావతి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఎండల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. ఎండల్లో తిరగకుండా ఎక్కువగా ద్రవ పదార్థ ఆహారంగా తీసుకోవాలన్నారు కార్యక్రమంలో జిల్లా ఎపిడెమియాలజీ అధికారిణి వాణి, డీఈఎంవో జయరామన్, వైద్యాధికారులు సోమశేఖర్, విష్ణుప్రియ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో తెలంగాణ దేవదాయ శాఖ కమిషనర్



ఐరాల(కాణిపాకం), మే 4: తెలంగాణ రాష్ట్ర దేవదాయ శాఖ కమిషనర్ హనుమంతురావు శనివారం కాణిపాక వరసిద్ధుని దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆయన్ను వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే మహిళల అభివృద్ధి

పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్





సూపర్‌సిక్స్ గురించి మహిళలకు వివరిస్తున్న మురళీమోహన్, సౌందర్‌రాజన్‌కు పార్టీ కండువా కప్పుతున్న మురళీమోహన్

పూతలపట్టు, మే 4: తెలుగుదేశం పార్టీ హయాంలోనే మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందారని పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ అన్నారు. శనివారం ఆయన మండలంలోని బైటపల్లి, తిమ్మిరెడ్డిపల్లి, వేపనపల్లి, ఆకనంబట్టు పంచాయతీల పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు ఆయన మాట్లాడుతూ టీడీపీకి వస్తున్న ఆదరణను చూసి వైసీపీ నేతలకు దిమ్మతిరుగుతోందన్నారు కార్యక్రమంలో యువరాజు నాయుడు, దొరబాబు చౌదరి, గంగారపు గోపి, ప్రతాపనేని చంద్రమౌళి, ఎల్బీఐ లోకేష్ రెడ్డి, లక్ష్మీనారాయణ, నాగరాజు, దగ్గుపాటి మోహన్, క్రిష్ణమ నాయుడు, నరేష్ బాబు, సతీష్, హేమాద్రి, మనోహర్, హరి, పురుషోత్తం పాల్గొన్నారు.

యాదమరి : యాదమరి మండలం కోణాపల్లెకు చెందిన స్నేహ డెకార్స్ అధినేత ఎం. సౌందర్‌రాజన్ శనివారం టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి మురళీ మోహన్ రామిరెడ్డిపల్లెలో నిర్వహించిన ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో సౌందర్‌రాజన్ పార్టీలో చేరారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్ రబి, పూతలపట్టు మండల నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాక్షస పాలన పోవాలి : డాక్టర్ థామస్







ఆర్‌కేవీబీ పేటలో థామస్ ఎన్నికల ప్రచారం, కృష్ణజిమ్మాపురంలో భీమనేని చిట్టిబాబు, కరపత్రాలతో గంధమనేని జయశంకర్ నాయుడు తదితరులు

కార్వేటినగరం,మే4: రాష్ట్రంలో రాక్షసపాలన పోవాలంటే మళ్లీ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి రావాలని జీడీ నెల్లూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ థామస్ పేర్కొన్నారు. శనివారం కార్వేటినగరం మండలం ఆర్‌కేవీబీ పేటలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వచ్చే ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను అఖండ విజయంతో గెలిపించాల్సిందిగా ఓటర్లను కోరారు. అలాగే కలికిండ్లులో థామస్ భార్య శాంతి రెడ్డి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు జనార్ధన్‌రాజు, నాగేశ్వరాజు, చెంగల్‌రాయల్ యాదవ్, రాజేందర్ రెడ్డి, బీజేపీ నాయకుడు రాజశేఖర్, జనసేన నాయకులు యుగంధర్, సెల్వి తదితరులు పాల్గొన్నారు.

పెనుమూరు : తనకు ఒక్క అవకాశం ఇచ్చి చూడండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని టీడీపీ అభ్యర్థి థామస్ కోరారు. శనివారం ఆయన పెనుమూరు బజారులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రుద్రయ్యనాయుడు, హరిబాబు నాయుడు, కృష్ణమూర్తినాయుడు, పరమేశ్వర్‌రెడ్డి, తలారిరెడ్డెప్ప, పసుపులేటి రమేష్, యాగమనాయుడు, సురేష్‌నాయుడు, అశోక్, గోపాల్‌నాయుడు, మురళి పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం : ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని చిత్తుచిత్తుగా ఓడించాలని టీడీపీ మండల అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు అన్నారు. శనివారం మంగుంట పంచాయతీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు చంద్రబాబురెడ్డి, నరసింహులురెడ్డి, భూపతిరెడ్డి, నీరంజన్‌రెడ్డి, పుల్లూరుబాబు, ఎన్.కుమార్, హేమాద్రి యాదవ్, బాబు నాయుడు, వేమనాయుడు, గురునాథం, బాలాజీనాయుడు, రవి, తయ్యారు లోకేష్, నాగరాజు, జనసేన నాయకులు చందు, చార్లెస్ పాల్గొన్నారు.

రానున్నది టీడీపీ ప్రభుత్వమే : భీమనేని చిట్టిబాబు

పాలసముద్రం : ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుపొంది చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కృష్ణజిమ్మాపురం పంచాయతీలోని బలిజకండ్రిగ, కృష్ణజిమ్మాపురం, కొల్లురెడ్డికండిగ గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంచుతూ గంగాధరనెల్లూరు టీడీపీ అభ్యర్థి డాక్టర్ థామస్, పార్లమెంటు ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసు నాయుడు, శేఖర్ రాజు, రవి నాయుడు, జె. విజయ్‌కుమార్, అరుళ్‌నాథన్, తంగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థి సునీల్ అగ్రవర్ణాల చేతుల్లో కీలుబొమ్మ

● కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జగపతి ఆరోపణ

చిత్తూరు, మే 4: పూతలపట్టు వైసీపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌కు రాజ్యాంగంపై కనీస అవగాహన లేదని కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి జగపతి ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ దళితులకు వైసీపీ అన్ని కల్పించిందని ఆ పార్టీ అభ్యర్థి చెప్పడం అర్థరహితమన్నారు. పూతలపట్టు నియోజకవర్గంలోని అగ్రవర్ణాల చేతిలో సునీల్‌కుమార్ కీలుబొమ్మగా మారాడన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు రాణీయాదవ్, వాడ గంగరాజు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ అభిమానికి తీవ్రగాయాలు

గంగవరం, ఏప్రిల్ 4: సీఎం కాన్వాయ్ వెనుక పరిగెడుతూ చోటుచేసుకున్న తోపులాటలో ఓ అభిమానికి తీవ్రగాయాలయ్యాయి. బంగారుపాళ్యం మండలం పాలమాకులపల్లెకు చెందిన వైసీపీ అభిమాని చలపతి జగన్ సభకు హాజరయ్యాడు. జగన్ ప్రసంగం పూర్తవ గానే బస్సుయాత్ర ప్రారంభమైంది. బస్సువెనుకనే పరుగెత్తాడు. మదనపల్లె రోడ్డులోని రఘువీరారెడ్డి కాలనీ వద్ద తోపులాట జరగడంతో కాన్వాయ్ ముందు బోల్తాపడ్డాడు. అప్రమత్తమైన పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అతడిని పక్కకు లాగి ప్రాణాలు కాపాడగలిగారు. వెంటనే అక్కడే ఉన్న అంబులెన్సులో చికిత్సలు అందించి పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వైసీపీ పాలనకు అంతిమ రోజులొచ్చాయి

నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్



సమావేశంలో ప్రసంగిస్తున్న భానుప్రకాష్

నగరి మే4: కలిసికట్టుగా ఎన్నికలలో పనిచేస్తే విజయం మనదేనని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ అన్నారు. నగరి టీడీపీ కార్యాలయంలో శనివారం నగరి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలతో కొనసాగుతున్న వైసీపీ పాలనకు అంతిమ రోజులొచ్చాయని తెలిపారు. కష్టపడే వారికి ప్రభుత్వం వచ్చాక తగిన ప్రతిఫలం ఉంటుందన్నారు. వ్యక్తిగత కక్షలు, ఇతర తగాదాలకు రాజకీయాన్ని ఆపాదించకుండా సైకిల్ గుర్తుకు ఏమి చేస్తే ఓట్లు ఎక్కువ వస్తాయన్న ఆలోచనతోనే ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ అధికార ప్రతినిధి చినబాబు, అనిల్‌కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, కార్యదర్శి పురుషోత్తం నాయుడు, టీఎన్‌టీయూసీ కార్యదర్శి బాలాజీ, తెలుగు మహిళ అధికార ప్రతినిధి మీరా తదితరులు పాల్గొన్నారు. అలాగే నగరి మున్సిపాలిటీలోని ఒకటవ వార్డులో రామానుజం, చలపతి, లత తదితరులు ప్రచారం ప్రారంభించారు. కనుమమిట్ట, ధర్మాపురం గ్రామాలలో ఇంటింటికి వెళ్లి సైకిల్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో అలిమేలు, రాధ, హేమ, అంజేరమ్మ, కన్నెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వడమాలపేట : మండలంలోని కదిరిమంగళం, వడమాలపేట, ఓటీఆర్ కండ్రిగ, ఎస్‌బీపురం సాయంత్రం చింతకాల్వ, పత్తిపుత్తూరు అప్పలాయగుంట, బాలినాయుడు కండ్రిగ, సీతారామపురం, బట్టీకండ్రిగ, ఏఎం పురం, పూడి గ్రామాల్లో గాలి భాను ప్రకాష్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనమందరం బాగుపడాలంటే సైకిల్ గుర్తుకు ఓటేసి గెలపించాలని కోరారు.